PSBH

ద్విశాతాబ్ది ప్రచురణ



# ఫ్రెడరిక్ ఏంగెల్స్

## జీవితం–కృషి


సీతారాం ఏచూరి
ఎస్ వెంకట్రావు
ఎస్ చటర్జీ

# ఫ్రెడరిక్ ఎంగెల్స్

## జీవితం–కృషి

రచన:
సీతారాం ఏచూరి
ఎస్ వెంకట్రావు
ఎస్ చటర్జీ

అనువాదం:
ఎంవిఎస్ శర్మ
ఎస్ వెంకట్రావు

**ప్రజాశక్తి బుక్‌హౌస్**

*27–30–4, ఆకులవారి వీధి, గవర్నర్‌పేట, రాఘవయ్యపార్కు వద్ద*
*విజయవాడ – 520 002. ఫోన్ : 0866 – 2577533*

**ప్రథమ ముద్రణ** : నవంబర్, 2020

**ప్రతులు** : 2000

వెల : ₹ 25/-

**ప్రతులకు**

PSBH

**ప్రజాశక్తి బుక్‌హౌస్**

27-1-54, కారల్‌మార్క్స్ రోడ్, గవర్నర్‌పేట,

విజయవాడ -2, ఫోన్ : 0866 -2577533

**బ్రాంచీలు**

విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, గుంటూరు, కాకినాడ,

ఏలూరు, విజయనగరం, ఒంగోలు, నెల్లూరు, కర్నూలు, అనంతపురం

**ముద్రణ**

ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, విజయవాడ

website : www.psbh.in

prajasaktipublishinghouse@gmail.com

150206

## ప్రపంచపు తొలి మార్క్సిస్టు

# ఫ్రెడరిక్ ఎంగెల్స్

**– సీతారాం ఏచూరి**

నవంబరు 28, 2020 ఫ్రెడరిక్ ఎంగెల్స్ ద్విశత జయంతి. ఈ కరోనా మహమ్మారి విజృంభణ, దాని పర్యవసానంగా మనం తప్పనిసరిగా పాటించవలసిన జాగ్రత్తలు, లాక్‌డౌన్ నిబంధనలు మనకు పరిమితులు విధించాయి గాని లేకుంటే 2018–19లో మార్క్స్ ద్విశత జయంతిని ఏవిధంగా ఘనంగా నిర్వహించామో, అదే విధంగా ఇప్పుడూ నిర్వహించవలసిన సందర్భం ఇది.

మార్క్సిస్టు ప్రాపంచిక దృక్పథాన్ని ఆవిష్కరించడంలో, దానిని విశదీకరించడంలో ఎంగెల్స్ పాత్ర, సైద్ధాంతిక కృషి అత్యంత ప్రాధాన్యత కలిగివుంది. గతితార్కిక పద్ధతి వ్యక్తమైన తీరును, విశ్వంలో సమస్త భౌతిక పరిణామ క్రమానికి వర్తించే నియమాలనూ, జీవ పరిణామ క్రమాన్నీ, మానవ సమాజ పరిణామ క్రమాన్నీ అవగాహన చేసుకోడానికి, వాటిలోని గతితర్కాన్ని గుర్తించడానికి ఎంగెల్స్ సైద్ధాంతిక కృషి ఎంతగానో తోడ్పడుతుంది. నిజానికి ఎంగెల్స్ రచనలనూ, మానవ మేధ, దార్శనికత, నాగరికతల పురోగమనంలో ఎంగెల్స్ పోషించిన సృజనాత్మక పాత్రనూ తిరిగి అధ్యయనం చేయవలసిన తరుణం ఇది. ఏదో ఒక్క వ్యాసంలోనే దీనినంతా వివరించడం అసాధ్యం. ప్రస్తుత పరిమితులెలా ఉన్నా, పార్టీ ఈ అంశాలన్నింటి పైనా రానున్న ఏడాది పొడవునా కార్యక్రమాలను చేపడుతుంది.

నేను ప్రస్తుతం ఒక ప్రధాన అంశాన్ని మాత్రం చర్చిస్తాను. ఆచరణను, సిద్ధాంతాన్ని గతితార్కికంగా మేళవించే ఒక ఆలోచనా విధానంగా మార్క్సిజానికి ఆ పేరు కారల్ మార్క్స్ నుండి వచ్చింది. అయితే ఈ విషయంలో ఎంగెల్స్ నిర్వహించినది అంత ప్రధానమైన పాత్ర కాదనే అభిప్రాయం తరుచుగా వ్యక్తమౌతూ వుంటుంది. ఇది చాలా చాలా పొరపాటు అభిప్రాయం అనే చెప్పాలి. తన రచనలలో పాదార్థిక, సామాజిక జీవితంలోని అన్ని అంశాలలోనూ గతితర్కాన్ని ఆవిష్కరించిన తీరును చూస్తే ఎంగెల్స్ ఎంత ప్రధానమైన పాత్ర పోషించాడో తెలుస్తుంది. మానవ సమాజం

పురోగమిస్తున్న ప్రస్తుత తరుణంలో, కొత్త పుంతలు తొక్కుతున్న శాస్త్రవిజ్ఞాన ఆవిష్కరణల నేపథ్యంలో ఎంగెల్స్ చేసిన ప్రతీ రచననూ మరోసారి చదవాల్సిన అవసరం ఉంది.

## సంయుక్తంగా మార్క్సిజం ఆవిష్కరణ

ఫ్రెడరిక్ ఎంగెల్స్ గురించి ప్రస్తావించేటప్పుడు తరుచూ 'ఆయన ప్రపంచంలో తొలి మార్క్సిస్టు' అని అభివర్ణిస్తారు. తనకు అంత పెద్ద ప్రాధాన్యత లేదన్నట్టుగా తనదైన నమ్రతతో వ్యవహరించే ఎంగెల్స్ ఈ హోదాను మాత్రం గర్వంగా స్వీకరించి వుండేవాడు. "మార్క్స్ ఏదైతే సాధించగలిగాడో, దానిని నేనైతే మాత్రం ఎన్నటికీ సాధించి వుండేవాడిని కాను. తక్కిన మా అందరికన్నా మార్క్స్ ఎత్తున ఉండేవాడు. మాకన్నా దూరం ఆలోచించేవాడు. మా అందరికన్నా తొందరగా, అందరికన్నా విశాలంగా చూడగలిగేవాడు. మార్క్స్ ఒక ప్రజ్ఞావంతుడైన మేధావి. మేమంతా మహా అయితే నైపుణ్యం గలవాళ్ళం మాత్రమే. అతనే లేకపోతే ఆ సిద్ధాంతం ఇప్పుడున్న దానికంటే చాలా వెనుకనే ఉండిపోయేది. అందుచేత ఆ సిద్ధాంతానికి ఆయన పేరు రావడమే సరైనది" అని ఎంగెల్స్ ఒక సందర్భంలో అన్నాడు.

ఇది ఎలా ఉన్నప్పటికీ, ఎంగెల్స్ గురించి మార్క్స్ అంచనా గమనార్హం. మార్క్సిస్టు ప్రాపంచిక దృక్పథపు సైద్ధాంతిక పునాదుల ఆవిష్కరణలో ఎంగెల్స్‌కు మార్క్స్ ప్రత్యేక స్థానాన్ని కల్పించాడు.

## మార్క్స్-ఎంగెల్స్ సహచర్యం

'రేనిష్ జేటుంగ్' అనే పత్రికకు మార్క్స్ సంపాదకుడిగా ఉండేవాడు. 1843 మార్చిలో ఆ పత్రికను మితవాద ప్రష్యన్ ప్రభుత్వం నిషేధించింది. 1844 ప్రారంభంలో మార్క్స్ పారిస్‌కు మకాం మార్చాడు. అక్కడ మార్క్స్ "డేయిష్ ఫ్రాంజోసిష్ జాబుషర్" అనే పత్రిక సంపాదకత్వం చేపట్టాడు. ఆనాడు ఆ పత్రికకు వ్యాసాలు పంపే వారిలో అతి పిన్న వయస్కుడు ఎంగెల్స్. తర్వాత కాలంలో నిర్వహణలో సహచరుడిగా మారాడు. 1844లో "రాజకీయ అర్థశాస్త్ర విమర్శ సింహావలోకనం" అనే వ్యాసాన్ని ఎంగెల్స్ రాశాడు. ఈ వ్యాసంలో బూర్జువా అర్థశాస్త్ర విమర్శకు సంబంధించిన మూల సూత్రాలను పేర్కొన్నాడు. బూర్జువా ఆర్థిక వ్యవస్థలోని అన్ని లక్షణాలూ ఉత్పత్తి సాధనాలపై ప్రైవేటు యాజమాన్య హక్కులను కల్పించే నిబంధనల నుండే అనివార్యంగా పుట్టుకొస్తాయని నిరూపించాడు. ఈ ప్రైవేటు యాజమాన్యం పోకుండా సమాజంలో పేదరికాన్ని పోగొట్టడం సాధ్యం కాదని కూడా నిరూపించాడు. దీనితో మార్క్స్ ముగ్ధుడయ్యాడు. హెగెలియన్ తత్వశాస్త్రంపై విమర్శ ద్వారా తాను ఏ నిర్ధారణకు వచ్చాడో, అదే నిర్ధారణకు మరొక మేధావి బూర్జువా ఆర్థిక వ్యవస్థపై విమర్శ ద్వారా వచ్చినట్టు నిర్ధారణకు వచ్చాడు. మార్క్సిస్టు ప్రాపంచిక దృక్పథం ఒక సిద్ధాంతంగా



రూపు దిద్దుకోవడంలో వారిరువురి కృషి ఉమ్మడిగా సాగడానికి, వారి స్నేహానికీ, ఉద్యమంలో కలసి పని చేయడానికీ, జీవితాంతం సహచరు లుగా కొనసాగడానికీ ఇది పునాది వేసింది.

"ఇంగ్లండులో కార్మికుల స్థితిగతులు" అన్న గ్రంథాన్ని ఎంగెల్స్ రచించాడు. ఇది ఒక దిశానిర్దేశం చేసిన రచన. ఇంగ్లండులో పారి శ్రామిక విప్లవం ఏవిధంగా ప్రారంభమయిందో, ఏ విధంగా పరిణామం చెందుతోందో పరిశీలిస్తున్న మార్క్స్ ఆలోచనను బాగా ప్రభావితం చేసింది ఈ రచన. 1844 ఆగస్టులో పది రోజుల పాటు వారిరువురూ చర్చలు సాగించారు. ఆ క్రమంలో ఎంగెల్స్‌లో ఉన్న ప్రజ్ఞను మార్క్స్ మరింతగా గుర్తించాడు. ఎంగెల్స్ ప్రదర్శించిన ధైర్యాన్ని, అంకితభావాన్ని, అతని ఏకాగ్రతను మార్క్స్ ఎంతగానో ప్రశంసించాడు. ఆనాటి సైద్ధాంతిక అంశాలన్నింటిపైనా వారిరువురికీ ఏకాభిప్రాయం ఉన్నట్టు గుర్తించాడు.

"పవిత్ర కుటుంబం" లేదా "విమర్శనాత్మక విమర్శపై విమర్శ" అన్న పుస్తకాన్ని ఇద్దరూ ఉమ్మడిగా 1844లో రచించారు. తత్వశాస్త్రం పైన, రాజకీయ అర్థశాస్త్రం పైన భావవాదం చూపుతున్న ప్రభావాన్ని పటాపంచలు చేస్తూ ఆ రచన సాగింది.

ప్రకృతికి అతీతమైన శక్తులు గానీ, మానవ చైతన్యం గానీ లేదా కొందరు విశిష్టవ్యక్తులు గానీ చరిత్రను సృష్టించరని వారిద్దరూ ఆ గ్రంథంలో రుజువు చేశారు. సమాజం ముందుకు సాగేది శ్రామిక ప్రజల శ్రమ వలన, వారు నడిపే రాజకీయ పోరాటాల వలన మాత్రమేనని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఉన్న పెట్టుబడిదారీ సమాజంలో తమ జీవన పరిస్థితుల్ని మార్చకుండా శ్రామిక వర్గం స్వేచ్ఛ పొందజాలరని, అందుచేత సమాజాన్ని దోపిడీ నుండి విముక్తి చేసే చారిత్రిక కర్తవ్యాన్ని శ్రామిక వర్గం నిర్వహించాల్సి వుంటుందని వివరించారు.

తాత్విక రంగంలో అప్పటి వరకూ పైచేయిగా ఉన్న భావవాదాన్ని ఎదిరించి భౌతికవాద పునాదిపై తత్వశాస్త్రాన్ని తిరిగి నిలబెట్టాల్సిన కర్తవ్యం ఉంది. 1845-46లో "జర్మన్ తాత్విక ఆలోచన' అన్న గ్రంథం ద్వారా మార్క్స్, ఎంగెల్స్ ఆ పని పూర్తి చేశారు. వారు ఉభయులూ చేసిన ఈ రచనలో సమగ్రంగా, ఒక క్రమపద్ధతిలో శ్రామిక వర్గ ప్రాపంచిక దృక్పథం అయిన గతితార్కిక, చారిత్రిక భౌతిక వాదానికి సంబంధించిన మూల సూత్రాలను రూపొందించారు.

నిజానికి, 1843-45 మధ్యకాలం మార్క్సిస్టు ప్రాపంచిక దృక్పథం పరిణామంలో చాలా ఫలవంతమైన కాలం. విప్లవకర ప్రజాస్వామ్యం నుండి శ్రామికవర్గ విప్లవంగా, హెగెలియన్ ప్రభావం నుండి చారిత్రిక భౌతికవాదంగా, తత్వశాస్త్రం నుండి రాజకీయ అర్థశాస్త్రం వైపుగా మలుపు తిరిగింది. మార్క్స్, ఎంగెల్స్ ఇద్దరూ కలిసి ఈ మౌలిక కృషి చేశారు.

న్యాయం గురించిన హెగెలియన్ తాత్విక సిద్ధాంతాన్ని మార్క్స్ విమర్శనాత్మకంగా పరిశీలించాడు. న్యాయ సంబంధాలు కానీ, రాజకీయ రూపాలు గానీ వాటంతటవే మనకు అవగతం కావనీ, మానవ మేధస్సు, లేదా చైతన్యం చెందే పరిణామం బట్టి కూడా అవగతం కావనీ, జీవితపు భౌతిక అస్తిత్వాన్ని బట్టి, అది ఉన్న భౌతిక పరిస్థితులను బట్టి మాత్రమే అవగతం చేసుకోగలుగుతామని మార్క్స్ నిర్ధారణకు వచ్చాడు. "పౌర సమాజం" అన్న పేర హెగెల్ ఒక ఆదర్శవంతమైన సమాజాన్ని చిత్రించాడు. "అఖండ భావం సాకారమయ్యే కొద్దీ" ప్రకృతికి అతీతమైన దాని ప్రభావం వలన ఈ ఆదర్శ సమాజం రూపొందుతుందని హెగెల్ భావించాడు. అయితే మార్క్స్ మాత్రం పౌర సమాజ నిర్మాణం రాజకీయ అర్థశాస్త్రంలోనే దొరుకుతుందన్న నిర్ధారణకు వచ్చాడు. అక్కడి నుండి మొదలై గతితార్కిక భౌతికవాదపు శక్తివంతమైన మూలసూత్రం "మానవుల చైతన్యం వారి అస్తిత్వాన్ని నిర్ణయించదు. తద్భిన్నంగా వారి సామాజిక అస్తిత్వమే వారి చైతన్యాన్ని నిర్ణయిస్తుంది" వద్దకు వచ్చాడు.

1848లో "కమ్యూనిస్టు ప్రణాళిక"ను ఇద్దరూ ఉమ్మడిగా రచించారు. మొదటి ఇంటర్నేషనల్ స్థాపనలో ఇద్దరూ ముఖ్య పాత్ర పోషించారు. తత్వశాస్త్రం పైన, రాజకీయ అర్థశాస్త్రం పైన విమర్శలను మేళవించి వారిద్దరూ రూపొందించిన విప్లవ సిద్ధాంతం 'కమ్యూనిస్టు ప్రణాళిక'లో వ్యక్తమైంది.

## ప్రకృతిలో గతితర్కం, మానవ సమాజ జీవితం

పెట్టుబడిదారీ వ్యవస్థ నడకను చీల్చి చెండాడే పనిలో మార్క్స్ పూర్తిగా మునిగిపోయాడు. ఆ కృషి అంతిమంగా పెట్టుబడి గ్రంథ రూపాన్ని తీసుకుంది. అందులో పెట్టుబడిదారీ ఉత్పత్తి క్రమంలోనే మానవ శ్రమ దోపిడీ జరుగుతుందని నిరూపించాడు. అందుచేత మానవజాతి విముక్తి సాధించాలంటే పెట్టుబడిదారీ సమాజాన్ని కూలదోయడం అనేది కేవలం ఒక నైతికమైన కర్తవ్యం మాత్రమే కాదని, అదొక శాస్త్రీయమైన ఆవశ్యకత అని రుజువు చేశాడు. ఈ సమయంలో గతితర్కాన్ని, ఇతర రంగాలలోకి విస్తరించి వర్తింపజేయడంమీద ఎంగెల్స్ దృష్టిని కేంద్రీకరించాడు.

**మానవుడు-ప్రకృతి యొక్క గతితర్కం:** గతితార్కిక చారిత్రిక భౌతిక వాదానికి ప్రాతిపదిక మానవుడికి, ప్రకృతికి నడుమ నిరంతరం ఉండే గతితార్కిక సంబంధం. తన జీవితాన్ని, తన చుట్టూ ఉండే పరిస్థితులను మరింత మెరుగు పరుచుకోవడం

కోసం ప్రకృతిని తనకనువుగా మలుచుకొనే ప్రయత్నాలను మానవులు నిరంతరం సాగిస్తూనే వుంటారు. ఈ క్రమంలో మానవులు ప్రకృతిని తమకనుగుణంగా మార్చుకుంటూ వున్నప్పుడే ప్రకృతి కూడా మానవులను, మానవ పరిణామాన్ని ప్రభావితం చేస్తుంది. ఇదొక గతితార్కిక క్రమం. "వానరుడి నుండి నరుడిగా మారిన పరిణామ క్రమంలో శ్రమ పాత్ర" అన్న తన వ్యాసంలో ఎంగెల్స్ మానవులకూ, ప్రకృతికీ మధ్య గతితార్కిక క్రమం ఏవిధంగా పరిణామం చెందుతుందో వివరించాడు. మనిషి చేతులు, జ్ఞానేంద్రియాలు, వాక్కు వంటివి అభివృద్ధి చెందడం వెనక శ్రమ ఎటువంటి పాత్ర పోషించిందో తెలియజేశాడు. ఇవన్నీ ఏదో ఒక దైవశక్తి సృష్టించినవి కావనీ, భౌతిక జీవిత క్రమంలోనే అవి రూపొందాయనీ తేల్చిచెప్పాడు.

**ప్రకృతిలో గతితర్కం:** ప్రకృతికీ, శాస్త్ర విజ్ఞాన అభివృద్ధికీ గతితార్కిక భౌతికవాదాన్ని వర్తింపజేస్తూ ఎంగెల్స్ ముందుకు సాగాడు. "ప్రకృతి, మానవ సమాజం, ఆలోచన... వీటిలో కలిగే మార్పులకు, అభివృద్ధికి సంబంధించిన సర్వ సాధారణ నియమాలే గతితర్కం" అని నిర్ధారించాడు.

**గతితర్కంరాఆంత్రోపాలజీ:** (మానవుడు ఒక జంతువు అనే దృష్టితో చేసే సంపూర్ణ పరిశీలన-ఆంత్రోపాలజీ) ఎంగెల్స్ తన కాలం నాటికి అందుబాటులో ఉన్న సమాచారం ఆధారంగా (ప్రాచీన సమాజాల, త్రవ్వకాలలో లభించిన అవశేషాల, పరిశోధనల ఆధారంగా) చారిత్రిక భౌతిక వాదాన్ని మానవ పరిణామ క్రమానికి వర్తింపజేశాడు. "కుటుంబం, వ్యక్తిగత ఆస్తి, రాజ్యాంగాల పుట్టుక" అన్న తన గ్రంథంలో ఆధునిక వర్గ సమాజం గురించి ప్రచారంలో ఉన్న కట్టుకథలనన్నింటినీ బట్టబయలు చేశాడు. ఆస్తి ప్రాతిపదికన ఏర్పడిన వర్గ సంబంధాలు ఏవిధంగా కుటుంబం పుట్టుకను మార్చివేశాయో, చారిత్రికంగా స్త్రీ ఏవిధంగా ఓటమి చెందిందో, పాతివ్రత్యం, పితృస్వామిక సమాజం, వాటి పర్యవసానంగా మహిళల అణచివేత ఏవిధంగా సంభవించాయో నిరూపించాడు.

**గతితర్కం-చరిత్ర :** "జర్మనీలో రైతాంగ యుద్ధం" (1849-50) అనే గ్రంథంలో మొదటిసారిగా ఎంగెల్స్ గతితార్కిక భౌతిక వాదాన్ని వాస్తవ చరిత్రకు వర్తింపజేశాడు.

**గతితర్కం-తత్వశాస్త్రం :** యూజెన్ డుహ్రింగ్ అనే ఒక తత్వవేత్త మార్క్సిజాన్ని పూర్వపక్షం చేస్తూ తానొక బ్రహ్మాండమైన సిద్ధాంతాన్ని రూపొందించానని చెప్పుకున్నాడు. అతగాడి సిద్ధాంతాన్ని ఖండిస్తూ ఎంటీ-డుహ్రింగ్ అనే గ్రంథాన్ని ఎంగెల్స్ రచించాడు. మార్క్సిజాన్ని, గతితార్కిక, చారిత్రిక భౌతిక వాదాన్ని సమర్థిస్తూ సాగిన ఈ గ్రంథం చాలా ప్రభావం కలుగజేసింది.

అందుచేత, దాదాపు అన్ని రకాల కార్యాచరణలోనూ, ప్రయత్నాలలోనూ

మార్క్స్‌తో కలిసి సంయుక్తంగా, స్వతంత్రంగా ఎంగెల్స్ చాలా ఫలవంతమైన కృషి చేశాడు. ప్రకృతి శాస్త్రాలలో, ఆంత్రోపాలజీలో, చరిత్రలో, రాజకీయ అర్థశాస్త్రంలో, తత్వశాస్త్రంలో మానవుడు– ప్రకృతి నడుమ గల గతితార్కిక సంబంధం ఏవిధంగా వర్తిస్తుందో వివరించాడు. తద్వారా విప్లవోద్యమానికి, విప్లవ సిద్ధాంత పునాదుల నిర్మాణానికి తనవంతుగా ప్రత్యేక సేవ, తోడ్పాటు చేశాడు. వారిద్దరూ విడివిడిగా గానీ, ఉమ్మడిగా గానీ చేసిన రచనలు అన్నీ ఆ ఇద్దరూ పరస్పరం చర్చించుకున్నాకనే చేశారని ఇక్కడ మనం గుర్తుంచుకోవాలి.

## రాజకీయ కార్యాచరణ

నవ యుగానికి బాటలు వేసే ఇటువంటి సిద్ధాంతానికి పునాదులు వేసిన ఈ ఇద్దరు మహానేతలూ అంతర్జాతీయ కార్మికోద్యమంలో కేవలం సిద్ధాంతాన్ని బోధించేందుకే పరిమితం కాలేదు. ఆనాటి కార్మికోద్యమాలలో చురుకుగా పాల్గొన్నారు. కొన్ని సందర్భాలలో వాటికి నాయకత్వం వహించారు, మార్గదర్శకత్వం అందించారు.

శ్రామిక వర్గాన్ని విజయ సాధన దిశగా నడిపించే శక్తి గల ఒక విప్లవకర సంస్థ నిర్మాణానికి ఈ ఇద్దరు మహా నేతలూ తమ జీవితాలను ధారపోశారు. మొదటి ఇంటర్నేషనల్ అనే పేర ప్రసిద్ధికెక్కిన 'ఇంటర్నేషనల్ వర్కింగ్‌మెన్స్ అసోసియేషన్'ను స్థాపించడంలో (1864) వారిద్దరూ ముఖ్య పాత్ర పోషించారు. వామపక్షవాద గ్రూపులన్నింటినీ ఒక ఉమ్మడి సంస్థతోకి తీసుకు వచ్చి సంఘటితం చేయడానికి చేసిన మొదటి ప్రయత్నం అది. అంతర్జాతీయ కార్మికోద్యమంలో అది ముఖ్యమైన తొలి అడుగు.

## శాస్త్రీయత–విప్లవకారుడు

అంతర్జాతీయ కార్మికోద్యమానికి, ప్రపంచానికి మార్క్సిస్టు దృక్పథం గురించీ, ఎంతో విలువైన ఆ సిద్ధాంత పునాదుల గురించీ, మార్క్స్ మరణానంతరం ఎంగెల్స్ ద్వారానే ప్రధానంగా తెలిసింది. అసంఖ్యాకంగా మార్క్స్ విడిచి వెళ్ళిన ఆయన నోట్సులను ఒక క్రమ పద్ధతిలో పెట్టి వాటిని ఎడిట్ చేసి 'పెట్టుబడి' గ్రంథం రెండవ, మూడవ సంపుటాలను ప్రచురించడంలో ఎంగెల్స్ కీలక పాత్ర పోషించాడు. 'కమ్యూనిస్టు ప్రణాళిక'కు, వారిద్దరి ఇతర రచనల మలి సంపుటాలకు ఆయా వర్తమాన పరిణామాల ఆధారంగా ముందు మాటలు రాశాడు. తద్వారా అంతర్జాతీయ కార్మిక వర్గ పోరాటాలు ముందుకు సాగడానికి ప్రేరణ కల్పించాడు.

లెనిన్ చెప్పినట్టు ఎంగెల్స్ "శ్రామిక వర్గానికి తామేమిటో నేర్పి తమ గురించిన స్పృహ కల్పించాడు, కలల స్థానే శాస్త్రీయతను ప్రతిష్టించాడు".

# ఫ్రెడరిక్ ఎంగెల్స్

## జీవితం-కృషి

**- ఎస్. వెంకట్రావు**

ఒక మనిషిని మరో మనిషి, ఒక జాతిని మరో జాతి దోపిడీ చేయడానికి వీలులేని నూతన సోషలిస్టు సమాజ నిర్మాణానికి మార్గదర్శనం చేసిన మహనీయులు కారల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఎంగెల్స్. వారు రూపొందించిన సిద్ధాంతం శాస్త్రీయ సోషలిజం. కార్మిక వర్గ విప్లవాలకు అది కరదీపిక. ఆ సిద్ధాంతం ఆధారంగానే లెనిన్ రష్యాలో అక్టోబర్ విప్లవాన్ని సాధించాడు. చైనాలో, వియత్నాంలో, కొరియాలో, క్యూబాలో ఇంకా అనేకానేక దేశాల్లో ఈ సిద్ధాంతాన్ని ఆయుధంగా చేసుకునే ప్రజలు విప్లవాలు సాధించుకున్నారు, సోషలిజం నిర్మించుకున్నారు. ఆ సిద్ధాంతాన్ని కారల్ మార్క్స్ పేర 'మార్క్సిజం' అని పిలుస్తున్నప్పటికీ వాస్తవానికి దాన్ని రూపొందించినవారు మార్క్స్-ఎంగెల్స్ ఇద్దరూ. తరువాతి కాలంలో దాన్ని లెనిన్ నూతన సామ్రాజ్యవాద దశకు నిర్దిష్టంగా వర్తింపజేయడం ద్వారా మరింత పరిపుష్టం చేశాడు కనుక దాన్ని మార్క్సిజం- లెనినిజం అని పిలుస్తున్నాం.

కొన్ని వేల సంవత్సరాలుగా మానవజాతి సంతరించుకున్న విజ్ఞానాన్ని క్రోడీకరించి, ప్రకృతిగతి సూత్రాలను అవగతం చేసుకుని మార్క్స్-ఎంగెల్స్ ప్రతిపాదించిన శాస్త్రీయ సిద్ధాంతం చరిత్ర గతినే మార్చడానికి దోహదపడింది. అటువంటి సిద్ధాంతాన్ని రూపొందించడంలో మార్క్స్‌తో కలిసి కృషి చేయడం, ఆయనకు అన్నివిధాలా సహకరించడమే కాదు తను కూడా మార్క్సిస్టు సిద్ధాంత రూపకల్పనలో స్వతంత్ర కృషి సల్పిన మహామేధావి ఫ్రెడరిక్ ఎంగెల్స్. ఎంగెల్స్ ఒక మహా తత్వవేత్త, శాస్త్రీయ సోషలిస్టు సిద్ధాంతవేత్త, చరిత్రకారుడు, రాజకీయ శాస్త్రవేత్త వాటితోపాటు గొప్ప మానవతావాది, స్నేహశీలి, త్యాగశీలి. 2020 నవంబర్ 28న ఆ మార్క్సిస్టు మహోపాధ్యాయుని ద్విశతజయంతి. సంవత్సరమంతా ఎంగెల్స్ ద్విశతజయంతి కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా మానవాళి విముక్తికి మార్గం చూపిన

ఆ మహామహోపాధ్యాయుని జీవితాన్ని గురించి రేఖామాత్రంగా తెలుసుకుందాం.

## బాల్యం

ఫ్రెడరిక్ ఎంగెల్స్ జర్మనీలోని బర్మెన్ నగరంలో 1820 నవంబర్ 28వ తేదీన ఒక జౌళి పారిశ్రామిక వేత్తల కుటుంబంలో జన్మించాడు. ఎనిమిది మంది సంతానంలో ఆయన పెద్దవాడు. తండ్రిపేరు ఫ్రెడరిక్ ఎంగెల్స్ సీనియర్. తల్లి ఎలిజబెత్ ఫ్రాంజిస్కా మారిటియా వాన్ హార్. ఎంగెల్స్ కుటుంబానికి బర్మెన్ నగరంలోనూ, ఇంగ్లండులోని మాంచెస్టర్‌లోనూ కాటన్ టెక్స్‌టైల్ మిల్లులున్నాయి. ఆనాటికి ఇంగ్లండులోని మాంచెస్టర్‌లో టెక్స్‌టైల్ పరిశ్రమ బాగా అభివృద్ధి చెందింది. ఇంగ్లండుతో పోలిస్తే జర్మనీ కొంత వెనుకబడి ఉన్నప్పటికీ బర్మెన్ నగరంలో మాత్రం ఈ పరిశ్రమలు ఎక్కువగా ఉండేవి.

ప్రాథమిక విద్య అయిన తరువాత 13వ ఏట ఎంగెల్స్‌ను దగ్గరలో గల ఎల్బెర్ఫెల్డ్ నరగంలోని గ్రామర్ స్కూల్‌లో చేర్చారు. 17వ ఏట చదువు మాన్పించేశారు. కుటుంబానికి చెందిన వ్యాపారంలో అప్రంటిస్‌గా ఎంగెల్స్‌ను చేర్పించి ఆయనను మంచి వ్యాపార వేత్తగా మార్చాలన్నది ఆయన కుటుంబ సభ్యుల ఆలోచన. కానీ ఎంగెల్స్ ఆలోచనలు వేరుగా ఉండేవి. అప్పట్లో జర్మనీ తత్వశాస్త్ర విజ్ఞాన ఖనిగా ఉండేది. తత్వ శాస్త్రంలో అనేక నూతన సిద్ధాంతాలు బయలు దేరాయి. ఎంగెల్స్ మంచి అధ్యయన పరుడు. ఆయన పాఠశాలలో ప్రకృతి శాస్త్రం, భౌతిక శాస్త్రం చదివాడు. అనేక భాషలు నేర్చుకున్నాడు. సాహిత్యం అధ్యయనం చేశాడు. ముఖ్యంగా జర్మన్ తత్వశాస్త్ర చర్చలు ఆయనను ఆకర్షించాయి. దీంతోబాటు ఫ్రాన్స్ నుండి జర్మనీలోకి విప్లవ భావాలు ప్రవేశించేవి. అవి యువతలో అభ్యుదయ భావాలను ప్రేరేపించేవి.

## అభ్యుదయ భావజాలం

బాల్యంలోనే ఎంగెల్స్‌లో అభ్యుదయ భావాలు ప్రవేశించాయి. ఆయనది గట్టి మతనమ్మకాలు గలిగిన ప్రొటెస్టెంట్ కుటుంబం. కానీ ఎంగెల్స్‌కు మత నమ్మకాల పట్ల అసహ్యం ఏర్పడింది. డేవిడ్ ఫ్రెడరిక్ స్ట్రాస్ ప్రచురించిన "జీసస్ జీవితం" అనే గ్రంథం ఆయనలో హేతువాద భావాలను పెంపొందించింది. తన చట్టూ సమాజంలోని అన్యాయాలను వ్యతిరేకించేవాడు. పరిశ్రమాల్లో కార్మికులు పడుతున్న కష్టాలను చూసి వారిపట్ల సానుభూతి పెంచుకున్నాడు.

ఎంగెల్స్‌ను ఈ అభ్యుదయ భావాలకు దూరంగా ఉంచాలనే ఉద్దేశంతో కుటుంబ సభ్యులు ఆయనను 18వ ఏట 1838లో జర్మనీలోని బ్రెమెన్ నగరానికి పంపించి వ్యాపారంలో తర్ఫీదు ఇవ్వడం కోసం ఒక సంస్థలో చేర్చారు. ఓడరేవు నగరమైన బ్రెమెన్ వ్యాపార, వాణిజ్యాలకు నిలయంగా ఉండేది. అక్కడ ఆయన హెగెల్

తత్వశాస్త్రాన్ని అధ్యయనం చేస్తూ యువహెగేలియన్‌గా మారాడు. జర్మన్ తత్వశాస్త్రంలో నాడు హెగెలియన్ గతితర్కం ఆధిపత్యం కలిగి యువకులను బాగా ఆకర్షించేది. బ్రెమెన్‌లో అప్రెంటిషిప్ చేస్తున్న సమయంలోనే ఎంగెల్స్ స్వంత రచనలు చేయడం ప్రారంభించాడు. ఆయన తొలి రచన "ఎడారి దిమ్మరులు" (ది బెడౌన్) అనే కవిత. 1838 సెప్టెంబర్‌లో స్థానిక పత్రికలో ప్రచురితమైంది. ఆయన సాహిత్యం రాయడంతో పాటు, పారిశ్రామికీకరణ తీసుకువచ్చిన సామాజిక రుగ్మతలను విమర్శిస్తూ అనేక వ్యాసాలు రాశాడు. అయితే తన విమర్శనాత్మక



యవ్వనంలో ఎంగెల్స్

రచనలు కుటుంబానికి ఆపాదించబడకూడదనే ఉద్దేశ్యంతో "ఫ్రెడరిక్ ఓస్వాల్డ్" అనే మారుపేరుతో రాసేవాడు. ఈ తొలి రచనలు 1839లో 'వుప్పెర్టల్ ఉత్తరాలు' శీర్షికతో ప్రచురించబడ్డాయి.

1841లో ఎంగెల్స్ ఒక ఏడాదిపాటు బెర్లిన్ రక్షణ శాఖలో సైనికుడిగా పనిచేశాడు. ఆ కొద్ది కాలంలోనే ఆయన సైనిక శాస్త్రాన్ని అధ్యయనం చేసి గొప్ప సైనిక నిపుణుడుగా తయారయ్యాడు. ఫ్రాన్స్, ప్రష్యా (నేడు జర్మనీలో భాగం) దేశాలమధ్య జరిగిన యుద్ధ కాలంలో ఆయన సైనిక వ్యూహాల గురించీ, ఆయుధ గమనాన్ని గురించీ "పాల్‌మాల్ గెజెట్" అనే పత్రికలో వ్యాసాలు రాశాడు. ఆ వ్యాసాలు చదివిన వారు ఎవరో గొప్ప యుద్ధతంత్ర నిపుణుడు వాటిని రాశాడని చర్చించుకున్నారు. సైన్యంలో ఉన్న కాలంలోనే ఆయన బెర్లిన్ విశ్వవిద్యాలయంలో క్లాసులకు హాజరవుతూ థియాలజీ, ఫిలాసఫీలను అధ్యయనం చేశాడు. కార్మికుల్లో నిరుద్యోగం, వారి దుర్భర జీవన పరిస్థితులను వివరిస్తూ ఆయన మారుపేరుతో రాసిన వ్యాసాలు "రేనిష్ జేటుంగ్" అనే పత్రికలో ప్రచురితమైనాయి. ఆ పత్రికకు సంపాదకుడు కారల్ మార్క్స్. కానీ మార్క్సను అప్పటికి ఎంగెల్స్ కలుసుకోలేదు.

## మార్క్స్‌తో కలయిక

ఇంటికి పెద్ద కుమారుడైన ఎంగెల్స్ వ్యాపార వ్యవహారాలు వదిలిపెట్టి విప్లవ భావాలవైపు మళ్లడం ఆయన కుటుంబ సభ్యులను కలవరపెట్టింది. అందువల్ల ఈ వాతావరణం నుండి దూరంగా ఉంచడం కోసం ఎంగెల్స్ తండ్రి ఆయనను 1842లో ఇంగ్లండులోని మాంచెస్టర్ నగరంలో తమ కుటుంబానికి చెందిన నూలు మిల్లులో పనిచేయడానికి పంపించాడు. మాంచెస్టర్ వెళుతూ ఎంగెల్స్ జర్మనీలోని కొలోన్

నగరంలో గల 'రెనిష్ జేటుంగ్' కార్యాలయాన్ని సందర్శించాడు. అక్కడ కారల్ మార్క్స్‌ను తొలిసారి కలిశాడు. అయితే ఆ కలియిక వారి మధ్య పెద్దగా ఇష్టతతో జరగలేదు. ఎందుకంటే అప్పటికే యువహెగేలియన్ల అభిప్రాయాలతో మార్క్స్ తెగతెంపులు చేసుకుని ఉన్నాడు. ఎంగెల్స్ ఇంకా బెర్లిన్‌కు చెందిన 'యువ హెగేలియన్ల'తోనే ఉన్నాడని మార్క్స్ పొరపాటుగా భావించాడు.

మాంచెస్టర్‌లో ఎంగెల్స్ తన 22వ ఏట నూలు దారాలు తయారు చేసే తన కుటుంబ పరిశ్రమలో చేరాడు. ఆనాడు మాంచెస్టర్ ప్రపంచంలోకెల్లా పెద్ద పారిశ్రామిక కేంద్రంగా, ప్రధానంగా వస్త్ర పరిశ్రమ కేంద్రంగా ఉండేది. దానికి సమీపంలోనే బర్మింగ్‌హాం, షెఫీల్డ్, లివర్‌పూల్ మొదలైనవి ప్రధాన పారిశ్రామిక కేంద్రాలుగా ఉండేవి. ఈ ప్రాంతం నాడు పెట్టుబడిదారీ వ్యవస్థకు కేంద్ర స్థానంగా ఉండేది. పెట్టుబడిదారీ విధానం సృష్టించిన పారిశ్రామిక కార్మిక వర్గం కూడా ఈ ప్రాంతంలోనే విస్తారంగా పెరిగి ప్రధాన రాజకీయ శక్తిగా రూపుదిద్దుకుంటున్నది. కార్మికుల రాజకీయ శక్తిగా చార్టిస్టు ఉద్యమం ప్రారంభమైంది. ఎంగెల్స్ మాంచెస్టర్‌లో ఉన్న 20 మాసాల కాలంలో ఆర్థికశాస్త్ర అధ్యయనానికీ, ఆర్థిక విషయాల పరిశీలనకూ ఉపయోగించాడు. యజమానులకూ, కార్మికులకూ మధ్య గల సంబంధాలను ప్రత్యక్షంగా పరిశీలించాడు. బాగా అభివృద్ధి అయిన పెట్టుబడిదారీ విధానంలో కార్మిక వర్గ దుర్భర దారిద్ర్య పరిస్థితులను గమనించాడు. ఈ పరిశీలనవల్లనే ఆయనకు కార్మికోద్యమం పట్ల అభిమానం పెరిగింది. మాంచెస్టర్‌లో ఉండగా 1843 అక్టోబర్, నవంబర్ నెలల్లో ఎంగెల్స్ ఆర్థిక విషయాల మీద తొలి రచన చేశాడు. "రాజకీయ అర్థశాస్త్ర సంక్షిప్త విమర్శ" అన్న పేరుతో రాసిన వ్యాసాన్ని పారిస్‌లో ఉన్న కారల్ మార్క్స్‌కు పంపాడు. 1944లో ఈ వ్యాసాన్ని మార్క్స్ 'డేయిష్ ఫ్రాంజోసిష్ జాబుషర్' అనే పత్రికలో ప్రచురించాడు.

కార్మికుల దుర్భర స్థితిని ఎంగెల్స్ చాలా లోతుగా అధ్యయనం చేశాడు. ముఖ్యంగా ఆనాడు ఫాక్టరీల్లో చిన్న పిల్లలతో కనికరం లేకుండా పనిచేయించుకుంటున్న తీరు, విపరీత పనిభారంతో మురికి కూపాల్లాంటి వాతావరణంలో నివసిస్తున్న కార్మికుల దారిద్ర్యాన్ని ఆయన నిశితంగా పరిశీలించి మూడు వ్యాసాలు రాసి మార్క్స్‌కు పంపించాడు. వాటిని మార్క్స్ 'రేనిష్ జేటుంగ్', 'డేయిష్ ఫ్రాంజోసిష్ జాబుషర్' పత్రికల్లో ప్రచురించాడు. ఈ వ్యాసాలలోని సమాచారాన్ని ఎంగెల్స్ తరువాతి కాలంలో తాను రాసిన ప్రసిద్ధ గ్రంథం 'ఇంగ్లాండులో కార్మికవర్గ స్థితిగతులు'లో ఉపయో గించుకున్నారు.

మాంచెస్టర్‌లో ఉండగా మార్క్స్, ఎంగెల్స్ మధ్య తరచూ ఉత్తర ప్రత్యుత్త రాలు

సాగేవి. ఈ ఉత్తరాల్లో ఇరువురూ అనేక విషయాలపై అభిప్రాయాలు పంచుకునేవారు. 'యువ హెగేలియన్ల' కమ్యూనిస్టు వ్యతిరేక సిద్ధాంతాలను ఇద్దరూ వ్యతిరేకించేవారు. 1844లో ఎంగెల్స్ మాంచెస్టర్‌లో ఉద్యోగాన్ని మానుకుని పారిస్ మీదుగా స్వస్థలం బర్మెన్ తిరిగి వెళ్లాడు. కుటుంబమంతా ఆయనను వ్యాపారంలో ప్రవేశించమని ఒత్తిడి చేసినా తన ఆశయాలకు విరుద్ధమైన వ్యాపారంలో ప్రవేశించడానికి ఆయన అంగీకరించలేదు. ఎంగెల్స్ మాంచెస్టర్‌కు వెళుతున్నప్పుడు మధ్యలో పారిస్‌లో ఆగి రెండోసారి మార్క్స్‌ను 1844 ఆగస్టు 28న కలుసుకున్నాడు. పారిస్‌లో ఉన్న పది రోజుల్లో వారిరువురూ తమ అభిప్రాయాలను గురించి సుదీర్ఘంగా చర్చించుకుని ఏకాభిప్రాయాలకు రాగలిగారు. వారి మధ్య ఏర్పడిన ఆ ఏకాభిప్రాయం చరిత్రలో అపూర్వమైన స్నేహంగా మారి మానవ కల్యాణానికి దోహదం చేసింది. ఇంగ్లండులో కార్మికవర్గ పరిస్థితులపై ఎంగెల్స్ రాసిన వ్యాసాలు మార్క్స్‌ను ఎంతగానో మెప్పించాయి. "ఒక సామాజిక వ్యవస్థలోని సానుకూల అంశాలను అనుభవించకుండా దానిలోని ప్రతికూలాంశాల భారాన్నంతటినీ మోస్తున్నది కార్మికవర్గం. అటువంటి వర్గం ఆ సామాజిక వ్యవస్థను ఎలా గౌరవిస్తుంది?" అని ఎంగెల్స్ అందులో పేర్కొన్నాడు. సమాజం సోషలిజంవైపు సాగుతున్న కొద్దీ కార్మిక వర్గమే విప్లవానికి నాయకత్వం వహిస్తుంది అన్న భావనను ఎంగెల్స్ నుండే మార్క్స్ స్వీకరించి తన తాత్విక చింతనలో భాగం చేసుకున్నాడు.



ఎంగెల్స్ సహచరి మేరీ బర్న్స్,
ఆమె సోదరి లిజ్జీ బర్న్స్

### మార్క్స్‌తో కలిసి శాస్త్రీయ సోషలిస్టు సిద్ధాంత ఆవిష్కరణ

జర్మన్ తత్వవేత్త జార్జి విల్హెల్మ్ హెగెల్ ప్రభావం ఆ నాడు జర్మనీ తత్వశాస్త్రంపై గాఢంగా ఉండేది. అనేక మంది యువహెగేలియన్ల మాదిరిగానే మార్క్స్, ఎంగెల్స్ కూడా తొలుత దానితో ప్రభావితమైనారు. అయితే హెగెల్ భావవాద తాత్విక ధోరణి నుండి వారు త్వరలోనే విడగొట్టుకున్నారు. కానీ నాడు అనేక మంది హెగెల్ శిష్యులు ప్రజాతంత్ర భావాలనూ, రాడికల్ రాజకీయ దృష్టినీ విడనాడి తాత్వికంగా కమ్యూనిజాన్ని వ్యతిరేకించడం ప్రారంభించారు. వారి సిద్ధాంతాలను తిప్పికొడుతూ ఒక పుస్తకం రాయాలని పారిస్‌లో మార్క్స్, ఎంగెల్స్ నిర్ణయించుకున్నారు. ఆ పుస్తకంలో ఎంగెల్స్ ఇంగ్లండులో కార్మికవర్గ పరిస్థితి, ఇంగ్లండు సామాజిక చరిత్ర మొదలైన భాగాలు

రాయాలనీ, మార్క్స్ రాజకీయ అర్థశాస్త్రం, న్యాయశాస్త్రం, చరిత్ర, నీతి మొదలైన భాగాలు రాయాలనీ నిర్ణయించుకున్నారు. ఎంగెల్స్ తను పారిస్‌లో ఉన్న పది రోజుల్లోనే రాయాల్సిన భాగాలు రాసి ఇచ్చేశాడు. ఇద్దరూ కలిసి దానికి ముందుమాట రాశారు. ఆ విధంగా మార్క్స్, ఎంగెల్స్ సంయుక్త సైద్ధాంతిక కృషితో 1844లో తొలి గ్రంథం వెలువడింది. ఈ గ్రంథం పూర్తి పేరు "పవిత్ర కుటుంబం లేదా విమర్శనాత్మక విమర్శకు విమర్శ: బ్రూనో బాయెర్ ముఠాకు జవాబు". కానీ దాన్ని 'పవిత్ర కుటుంబం' అనే పొట్టి శీర్షికతో పిలుస్తున్నారు. ఈ గ్రంథంలో వారు మొట్టమొదటి సారిగా ప్రాథమిక స్థాయిలో చారిత్రక భౌతికవాద సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. ప్రజలే చరిత్ర నిర్మాతలనీ, సమాజ పరిణామానికి నిర్ణాయక శక్తి ఆర్థిక ఉత్పత్తేననీ వారు తేల్చారు. ఇరువురూ కలిసి రాసిన ఈ "పవిత్ర కుటుంబం" మార్క్సిజం ఒక శాస్త్రీయ సిద్ధాంతంగా రూపొందే దశలో మొదటి మెట్టు.

మాంచెస్టర్ నుండి ఎంగెల్స్ తిరిగి జర్మనీలోని స్వంతవూరు వచ్చినా అక్కడ ఉండలేకపోయాడు. కుటుంబం ఒత్తిడి ఆయనపై పెరిగింది. ఆ పోరుపడలేక, మార్క్స్‌తో కలిసి పనిచేయాలన్న ఆకాంక్షతో ఎంగెల్స్ అప్పటికే మార్క్స్ నివసిస్తున్న బ్రస్సెల్స్ నగరానికి చేరుకున్నాడు. బెల్జియం రాజధానీ నగరం బ్రెస్సెల్స్. బెల్జియం 1830లో కొత్తగా ఏర్పడిన దేశం. ఐరోపాలో అత్యంత ఉదారవాద రాజ్యాంగం గల దేశం. దాన్ని ఆసరా చేసుకుని అనేక దేశాల విప్లవకారులు, పురోగామి శక్తులు అక్కడకు చేరుకుని పనిచేసేవారు. 1845 నుండి 1848 వరకు మార్క్స్, బ్రెస్సెల్స్, ఎంగెల్స్ బ్రస్సెల్స్ నగరంలో నివసించారు. 1845 వేసవిలో బ్రస్సెల్స్ చేరినప్పటి నుండి ఎంగెల్స్ పూర్తిగా విప్లవానికి అంకితమై పోయాడు. మార్క్స్‌తో కలిసి సైద్ధాంతిక కృషిలో నిమగ్నమయ్యాడు.

ఎంగెల్స్ బ్రస్సెల్స్ నగరానికి వచ్చేసరికి యువ హెగేలియన్లు "పవిత్ర కుటుంబం" పుస్తకంలో మార్క్స్, ఎంగెల్స్ లేవనెత్తిన అంశాలకు సమాధానం రాశారు. దానికి తిరిగి సమాధానం చెప్పాల్సిన అవసరం ఏర్పడింది. దాంతో మార్క్స్, ఎంగెల్స్ ఇద్దరూ పవిత్ర కుటుంబంలో వివరించని అంశాలతో 1845లో కొత్త పుస్తకం రాసి విడుదల చేశారు. దాని పేరు "జర్మన్ తాత్వికసిద్ధాంతం" (జర్మన్ ఐడియాలజీ). సిద్ధాంత రీత్యా ఇది చాలా విలువైన పుస్తకం. చారిత్రక భౌతికవాదాన్ని వారు ఈ గ్రంథంలో మరింత విపులంగా వివరించారు. శ్రామిక వర్గ కమ్యూనిస్టు విప్లవం అనివార్యంగా వచ్చితీరుతుందని వారు ఇందులో తేల్చారు. గతంలో జరిగిన విప్లవాలేవీ వర్గాలనూ, వర్గపాలననూ తొగించలేదని, కమ్యూనిస్టు విప్లవం వర్గాలతోబాటు అన్ని వర్గాల పాలననూ అంతం చేస్తుందని వారు చెప్పారు. పాలక వర్గాన్ని కూలదోయడానికే

కాకుండా ప్రజల్లో మార్పు తేవడానికి కూడా విప్లవం ఒక్కటే మార్గమని పేర్కొన్నారు. విప్లవం ద్వారా పాత సమాజపు భావాలు, అలవాట్లు, సాంప్రదాయాల నుండి, మూఢవిశ్వాసాలనుండి ప్రజలు విముక్తి పొందుతారని వివరించారు.

ఎంగెల్స్ బ్రస్సెల్స్‌లో కమ్యూనిజం కోసం జర్నలిస్టులనూ, ప్రచురణ కర్తలనూ సంఘటిత పరిచేందుకు మార్క్స్‌తో కలిసి 'బ్రస్సెల్స్ కమ్యూనిస్టు కరస్పాండెంట్ కమిటీ'ని ఏర్పాటు చేశాడు. దీని మహాసభ 1847 వేసవిలో జరిగినప్పుడు దాని కోసం "కమ్యూనిస్టుల నిజాంగీకారం" (కమ్యూనిస్టు కన్ఫెషన్ ఆఫ్ ఫెయిత్) అనే పత్రాన్ని ఎంగెల్స్ రూపొందించాడు.

## కమ్యూనిస్టు ప్రణాళిక

బ్రస్సెల్స్‌లో నివసించే కాలంలో మార్క్స్-ఎంగెల్స్ జర్మన్ కార్మికులను సమీకరించారు. రహస్యంగా పనిచేస్తున్న జర్మన్ కమ్యూనిస్టు లీగ్‌తో సంబంధాలు పెట్టుకుని అందులో చేరారు. అక్కడి నుండే జర్మనీ, ఫ్రాన్స్, ఇంగ్లండ్ దేశాలకు చెందిన కమ్యూనిస్టు గ్రూపులతో సంబంధాలు పెట్టుకున్నారు. మార్క్స్-ఎంగెల్స్ కొత్త సిద్ధాంతం కార్మికుల్లో చొచ్చుకుపోవడం ప్రారంభించింది.

కమ్యూనిస్టు లీగ్ పేరు 1847కు ముందు 'లీగ్ ఆఫ్ ది జస్ట్' (న్యాయపరుల సంస్థ) అని ఉండేది. మార్క్స్-ఎంగెల్స్ సిద్ధాంత ప్రభావంతో 1847 జూన్‌లో లండన్‌లో జరిగిన 'లీగ్ ఆఫ్ ది జస్ట్' మహాసభ తన పేరును కమ్యూనిస్టు లీగ్‌గా మార్చుకుంది. మానవులందరూ సమానులు అన్న లీగ్ పాత నినాదం స్థానంలో మార్క్స్-ఎంగెల్స్ ప్రతిపాదించిన 'ప్రపంచ కార్మికులారా ఏకం కండు' అనే కొత్త నినాదం వచ్చింది. కమ్యూనిస్టు సూత్రాలను వివరిస్తూ ఒక కరపత్రం తయారు చేయాలని కమ్యూనిస్టు లీగ్ మార్క్స్-ఎంగెల్స్‌ను కోరింది. 'కమ్యూనిస్టు సూత్రాలు' పేరుతో 1847 నవంబర్ 20న ఎంగెల్స్ ఒక చిత్తు ప్రతిని తయారు చేశాడు. లండన్‌లో జరిగిన కమ్యూనిస్టు లీగ్ రెండవ మహాసభలో ఈ చిత్తు ప్రతిపై పది రోజుల పాటు తీవ్రమైన వాదోపవాదాలు జరిగిన అనంతరం మార్క్స్-ఎంగెల్స్ సిద్ధాంతాన్ని మహా సభ ఆమోదిస్తూ చిత్తు ప్రతిని తిరగ రాసే పనిని వారికే అప్పగించింది. ఆ విధంగా ఇరువురు మహామహో పాధ్యాయులు కలిసి రూపొందించిన తుది పత్రమే "కమ్యూనిస్టు ప్రణాళిక" (కమ్యూనిస్టు మ్యానిఫెస్టో) పేరుతో ప్రపంచ ప్రఖ్యాతి గాంచింది. 1848 ఫిబ్రవరి 21న ప్రచురితమైన కమ్యూనిస్టు ప్రణాళిక నాటి నుండి నేటి వరకు ప్రపంచ కమ్యూనిస్టు లందరికీ శిరోధార్యంగా ఉంటూ వస్తున్నది.

## విప్లవ సేనానిగా ఎంగెల్స్

ఎంగెల్స్ విప్లవ సిద్ధాంతాన్ని రూపొందించడమే కాదు విప్లవాల్లో స్వయంగా

పాల్గొన్నాడు. 1948లో ఫ్రాన్స్‌లో విప్లవం ప్రారంభమై జర్మనీ తదితర దేశాలకు వ్యాపించింది. మార్క్స్-ఎంగెల్స్ ఈ విప్లవోద్యమాల్లో పాల్గొంటూ ప్రష్యాకు చేరుకున్నారు. 'న్యూ రేనిష్ జెటుంగ్' పత్రిక ద్వారా విప్లవోద్యమాన్ని బలపరచ నారంభించారు. కానీ ఆ విప్లవం అన్ని దేశాల్లోనూ ఓడిపోయింది. పత్రికను అణచివేశారు. మార్క్స్‌ను దేశం నుండి బహిష్కరించారు. ఎంగెల్స్ మాత్రం ప్రష్యాలోనే ఉండి విప్లవంలో పాల్గొన్నాడు. మూడు యుద్ధాల్లో స్వయంగా సైనికుడుగా, సేనానిగా పోరాడాడు. 1849లో రైన్ రాష్ట్రంలో తిరుగుబాటులో పాల్గొనేందుకు ఎల్బర్‌ఫెల్డ్‌కు చేరుకున్నాడు. కానీ ఆ తిరుగుబాటు అణచివేయబడింది. కొలోన్‌లో కొంతకాలం రహస్య జీవితం గడిపి, పలాటినేట్ ప్రాంతంలో తిరుగుబాటులో పాల్గొనేందుకు అక్కడకు చేరుకున్నాడు. తిరుగుబాటు వలంటీర్‌గా, దళ ఉపనాయకుడుగా పోరాడాడు. ఆ తిరుగుబాటు కూడా రక్తపుటేరుల్లో ముంచి అణచివేయబడింది. దాంతో అక్కడినుండి ఎంగెల్స్ స్విట్జర్లాండుకు పారిపోయాడు.

ప్రష్యానుండి పారిస్ చేరుకున్న మార్క్స్‌ను 1849 ఆగస్టులో ఫ్రాన్స్ ప్రభుత్వం దేశం నుండి బహిష్కరించింది. దాంతో ఆయన అక్కడి నుండి లండన్ చేరుకున్నాడు. స్విట్జర్లాండులో ఎంగెల్స్ ప్రష్యన్ల చేతజిక్కే ప్రమాదం ఉన్నందున తన దగ్గరకు రమ్మని మార్క్స్ కోరాడు. దాంతో ఎంగెల్స్ కూడా లండన్ చేరుకున్నాడు.

## త్రివిధ బాధ్యతలు

లండన్ చేరుకున్నాక ఎంగెల్స్ మూడు బాధ్యతలను స్వీకరించాల్సి వచ్చింది. మొదటిది, కారల్ మార్క్స్‌కు అతని సైద్ధాంతిక కృషిలో సహకరించడం. రెండు, మార్క్స్‌ను పూర్తిగా సైద్ధాంతిక కృషికి కేటాయించి ఆయనా, ఆయన కుటుంబ పోషణకు కావలసిన ఆర్థిక వనరులను సమకూర్చడం. మూడు, తను స్వతంత్రంగా సైద్ధాంతిక రచనలు సాగించడం. ఈ మూడు విధులనూ ఎంగెల్స్ ఎంతో అద్భుతంగా, ఆదర్శ వంతంగా, జయప్రదంగా నిర్వర్తించాడు.

మొదటిది, 1848-49 విప్లవాల తరువాత పూర్తిగా ఆర్థిక శాస్త్ర అధ్యయనంలో మునిగిన మార్క్స్ పెట్టుబడి గ్రంథం మొదటి భాగాన్ని పూర్తి చేసి 1867లో ప్రచురించాడు. ఈ గ్రంథంపై బూర్జువా విమర్శకులు దురుద్దేశ పూర్వకంగా పూర్తిగా మౌనం వహించినప్పుడు ఎంగెల్స్ వాటికి ప్రచారం కల్పించాడు. ఆ గ్రంథంపై బూర్జువా పత్రికల్లోనూ, ప్రజాస్వామ్య పత్రికల్లోనూ ఎంగెల్స్ రాసిన వ్యాసాలు ఆ గ్రంథాన్ని పదిమంది దృష్టికి తీసుకువచ్చాయి. పెట్టుబడి గ్రంథం తదుపరి భాగాలకు పూర్తి రూపమివ్వకుండానే మార్క్స్ మరణించాడు. దాంతో ఆయన వదిలి పోయిన చిత్తు ప్రతినీ, నోట్సునూ ఆధారం చేసుకుని మిగిలిన భాగాలు పూర్తి చేయాల్సిన

బాధ్యత ఎంగెల్స్‌పై బడింది. ఏళ్ల తరబడి తన శక్తి, సమయాన్నంతిటినీ వెచ్చించి ఎంగెల్స్ పెట్టుబడి 2, 3 భాగాలు పూర్తి చేశాడు. 3వ భాగం పూర్తి చేయడంలో ఆయన అనేక కష్టాలు పడాల్సి వచ్చింది. చాలా విషయాలను మార్క్స్ చిత్తుగా రాయడమే కాకుండా ఎప్పుడు ఏది తోస్తే దాన్ని రాసి వదిలిపెట్టాడు. వీటన్నిటినీ సమీకరించి ఒక క్రమ పద్ధతిలో పెట్టడానికి ఎంగెల్స్ ఎంతో శ్రమించడమే కాకుండా కొన్ని భాగాలను స్వయంగా రాయాల్సి వచ్చింది. ముఖ్యంగా పెట్టుబడి 3వ భాగంలో అనేక అధ్యాయాలు ఎంగెల్స్ స్వయంగా రాశాడు. ఇవన్నీ ఒక ఎత్తయితే పెట్టుబడి గ్రంథం 2,3 భాగాలకు ఎంగెల్స్ రాసిన ముందుమాటలు మరో ఎత్తు.




**పెంగ్విన్ సంస్థ ప్రచురించిన ఎంగెల్స్ గ్రంథం 'కుటుంబం, వ్యక్తిగత ఆస్తి, రాజ్యాంగాల పుట్టుక**

ఈ ముందుమాటల్లో...మార్క్స్ ఏ పరిస్థితుల్లో తన రాత ప్రతులను వదిలిపెట్టినదీ, మార్క్సిస్టు అర్థశాస్త్ర సిద్ధాంత ప్రాతిపదికలేమిటి, ఆ సిద్ధాంత ఆవిర్భావ ప్రధాన దశలేమిటి, వాటి ప్రత్యేకతలు ఏమిటి అనే విషయాలను ఎంగెల్స్ వివరించాడు. ఈ విధంగా ఎంగెల్స్ కృషి లేకపోయి ఉంటే మార్క్స్ పెట్టుబడి సంపూర్ణంగా వెలుగుచూసేది కాదు.

## మార్క్స్ కుటుంబ పోషణ

మార్క్సిస్టు సిద్ధాంత కృషికి కావలసిన అద్భుత మేధోశక్తి, ఓపిక, పట్టుదల మార్క్స్‌కు ఉన్నాయని పూర్తిగా నమ్మిన వ్యక్తి ఎంగెల్స్. అందువల్ల మార్క్స్ కృషికి ఎటువంటి అడ్డంకులు ఎదురవకుండా సంపూర్ణ సహకారం అందించడం ద్వారా మానవాళికి మేలు చేయాలనుకున్నాడాయన. దానికిగాను మార్క్స్ కుటుంబ పోషణ బాధ్యతను కూడా స్వీకరించాడు. అందుకోసం 1850లో మళ్లీ మాంచెస్టర్ వెళ్లి తనకు ఇష్టం లేకపోయినా కుటుంబ వ్యాపారంలో చేరాడు. మార్క్స్ రాజకీయార్థశాస్త్ర రచనలో నిండా మునిగిపోగా ఎంగెల్స్ ఆయన కుటుంబ పోషణ బాధ్యతలు చూసేవాడు. మార్క్స్ పెట్టుబడి మొదటి భాగం రాత పూర్తి చేయగానే ఎంగెల్స్‌ను తలచుకున్నాడు. 1867 ఆగస్టు 15 అర్ధరాత్రి ఆయన ఎంగెల్స్‌కు ఉత్తరం రాస్తూ: "పుస్తకం చివరి ప్రూఫులు చూడ్డం ఇప్పుడే పూర్తయింది. నీ ఒక్కడి తోడ్పాటు వల్లనే ఇది సాధ్యమైంది. నీవు నా కోసం త్యాగం చేసి ఉండకపోతే ఈ పని నేనెన్నటికీ పూర్తి చేయగలిగేవాణ్ణి కాదు. కృతజ్ఞతతో నిన్ను ఆలింగనం చేసుకుంటున్నా'' అని

పేర్కొన్నాడు. దాదాపు 20 ఏళ్లపాటు ఎంగెల్స్ ఈ వ్యాపారంలో ఉన్నా, మార్క్స్‌ను తరచూ కలుసుకోలేకపోయినా వారి మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు జరగని రోజులు చాలా తక్కువ. తాత్విక, ఆర్థిక, రాజకీయ విషయాలపై వారు నిరంతరం సంప్రదించుకుంటూనే ఉండేవారు.

## ఎంగెల్స్ స్వీయ రచనలు

ఒకవైపు మిత్రుడు మార్క్స్ సిద్ధాంత కృషికి సహకరిస్తూ, కార్మికోద్యమంలో పనిచేస్తూనే మరోవైపు ఎంగెల్స్ స్వయంగా మార్క్సిస్టు సిద్ధాంత ఆవిష్కరణలో తనవంతు భాగాన్ని అందించాడు. ఇంతకు ముందే చెప్పినట్లు "ఇంగ్లండులో కార్మిక వర్గ స్థితిగతులు" గ్రంథంలో ఎంగెల్స్ రూపొందించిన 'కార్మికవర్గమే విప్లవానికి నాయకత్వం వహించి సమాజ మార్పుకు దోహదం చేస్తుంది' అన్న భావనను మార్క్స్ స్వీకరించాడు. ఆ తరువాత మార్క్స్-ఎంగెల్స్ ఇద్దరూ కలిసి రాసిన "పవిత్ర కుటుంబం", "జర్మన్ తాత్వికసిద్ధాంతం" గ్రంథాలు చారిత్రక భౌతిక వాద సిద్ధాంతాన్ని అభివృద్ధి చేశాయి. ఆ తరువాత ఎంగెల్స్ రాసిన 'కమ్యూనిస్టు సూత్రాలు' చిత్తు ప్రతి ఆధారంగా ఇరువురు మహాపురుషులు కలిసి రాసిన "కమ్యూనిస్టు ప్రణాళిక" ప్రపంచ కార్మికవర్గానికి దీపదారిగా నిలిచిపోయింది. అప్పటినుండి ఏ గ్రంథమైనా ఇద్దరూ సంప్రదించుకుని ఏకాభిప్రాయానికి వచ్చిన తరువాతనే రాసేవారు. సైద్ధాంతిక కృషిలో ఎంగెల్స్ ఎప్పుడూ మార్క్స్ ఆధిక్యతను గుర్తించేవాడు. మార్క్స్ గొప్పదనాన్ని గురించి ఎంగెల్స్ ఇలా రాశాడు: "మార్క్స్ సాధించింది నేనైతే సాధించలేకపోయేవాణ్ణి. మార్క్స్ సమున్నతంగా నిలబడి, సుదూరంగా దృష్టి సారించగలడు. మా అందరికంటే వేగంగా, విశాలంగా వీక్షించగలడు. మార్క్స్ అసాధారణ మేధావి. మిగిలిన మేము మహా అయితే ప్రతిభావంతులం కావచ్చు. కానీ ఆయనే లేకుంటే ఆ సిద్ధాంతం ఈరోజున ఇలా ఉండేది కాదు. దాన్ని ఆ పేరు (మార్క్సిజం)తో పిలవడమే సరైంది." అదే సమయంలో మార్క్స్ ఏ విషయంలోనైనా ఎంగెల్స్ సలహాలనూ, సూచనలనూ, విమర్శనలనూ స్వీకరించేవాడు. పెట్టుబడి గ్రంథం నోట్స్ గురించి మార్క్స్ 1850 జూన్ 7న ఎంగెల్స్‌కు లేఖ రాస్తూ "ప్రథమ భాగం నీకు నచ్చిందంటే నాకు కలిగిన ఆనందానికి అవధుల్లేవు. ఈ విషయంలో నీదే తుది తీర్పుగా నేను భావిస్తున్నాను" అన్నాడు. 1867లో 'పెట్టుబడి' రాతప్రతిలోని కొన్ని భాగాలను ఎంగెల్స్‌కు పంపిస్తూ "ఈ నాలుగు పేజీలు కూడా నీకు సంతృప్తిని కలిగిస్తాయని భావిస్తున్నాను. ఈ ప్రపంచమంతా ఏమనుకున్నా నీకు నచ్చడమే నాకు కావల్సింది" అని మార్క్స్ రాశాడు. మార్క్స్-ఎంగెల్స్ మధ్య పనిలో అటువంటి ఐక్యతే కాదు ఒక విధమైన విభజన

జరిగింది. మార్క్స్ ఎక్కువగా రాజకీయ అర్థశాస్త్రం, చరిత్ర, గణిత శాస్త్రాలను అధ్యయనం చేస్తే, ఎంగెల్స్ ప్రకృతి శాస్త్రం, సైనిక, భాషా శాస్త్రాలు అధ్యయనం చేశాడు.

మార్క్స్‌తో కలిసి రాసిన గ్రంథాలు కాకుండా ఎంగెల్స్ స్వయంగారాసినవి 8 గ్రంథాలున్నాయి.

**1. ఇంగ్లండులో కార్మికవర్గ స్థితిగతులు:** ఈ గ్రంథం 1844లో ప్రచురితమైంది. తొలుత దీనికి సంబంధించిన మూడు వ్యాసాలను మార్క్స్ 'డేయిష్ ఫ్రాంజోసిష్ జాబుషర్' అనే పత్రికలో ప్రచురించాడు. ఈ వ్యాసాలు మార్క్స్‌ను ఎంతగానో ఆకట్టుకున్నాయి. దీనిపై మరింత పరిశోధించి పుస్తకంగా రాయమని ఒత్తిడి చేయడంతో ఎంగెల్స్ ఈ పుస్తకం వెలువరించాడు.

**2. జర్మనీలో రైతాంగ యుద్ధం:** 1848–49 విప్లవాల తరువాత 1850 వేసవిలో లండన్‌లో ఎంగెల్స్ ఈ గ్రంధం రాశాడు. ప్రస్తుత విప్లవానికీ, 1525లో జరిగిన యుద్ధాలకూ మధ్య తేడాను వివరించాడు. దీన్ని మార్క్సిస్టు పద్ధతిలో చరిత్రపై రాసిన మొదటి రచనగా చెప్పవచ్చు.

**3. వానరుడు నరుడుగా మారిన పరిణామ క్రమంలో శ్రమ పాత్ర:** ఎంగెల్స్ రాసిన 'ప్రకృతి గతితర్కం' (డయెలక్టిక్స్ ఆఫ్ నేచర్) గ్రంథంలోని 9వ భాగాన్ని ప్రత్యేక పుస్తకంగా 1876లో ప్రచురించారు. ఈ చిన్న పుస్తకంలో ఎంగెల్స్ మనిషికీ, ప్రకృతికీ మధ్య ఐక్యతను వివరించాడు. జంతుప్రాయమైన వానరుడి నుండి మనిషి పరిణామం చెందడంలో శ్రమ ఏ విధమైన పాత్ర నిర్వహించిందీ తెలిపాడు. తెలుగులో ఇది చాలా ప్రాచుర్యం పొందిన పుస్తకం.

**4. డుహ్రింగ్ సిద్ధాంత ఖండన (యాంటీ డుహ్రింగ్):** మార్క్సిస్టు సాహిత్యంలో అపూర్వమైన గ్రంథమిది. ఎంగెల్స్ రాసిన ఈ గ్రంథంలోని విషయాలు మొదట వోర్వార్ట్స్ అనే వార్తాపత్రికలో సీరియల్‌గా ప్రచురించారు. తరువాత 1878లో జర్మన్ భాషలో ప్రచురితమైంది. 1875 ప్రాంతంలో బెర్లిన్ విశ్వవిద్యాలయానికి చెందిన డాక్టర్ యూజిన్ డుహ్రింగ్ అనే వ్యక్తి తనే నిజమైన సోషలిస్టునని ప్రకటించుకుంటూ మార్క్సిజం స్థానంలో తన స్వంత పైత్యంతో కూడిన 'సోషలిజాన్ని' ప్రతిపాదించాడు. మార్క్సిజం నుండి తప్పుదోవ పిట్టించే ఈ సిద్ధాంతాన్ని ఖండిస్తూ రాయాల్సిన అవసరం ఏర్పడింది. మార్క్స్ అప్పుడు 'పెట్టుబడి' గ్రంథ రచనలో తీరికలేకుండా ఉన్నాడు. అందువల్ల ఆ పనిని ఎంగెల్స్ చేపట్టాడు. మార్క్సిజాన్ని ఇంత సర్వతోముఖంగా, ప్రతిభావంతంగా, శాస్త్రీయంగా వివరించిన గ్రంథం విశ్వ సాహిత్యంలో మరొకటి ఉండదు. ఇందులో ఎంగెల్స్ తత్వశాస్త్రం, అర్థశాస్త్రం, రాజకీయశాస్త్రం, విజ్ఞానశాస్త్రం,

విప్లవ వ్యూహం, చరిత్ర...వీటన్నిటి మీద ప్రామాణికమైన సైద్ధాంతిక వివరణ ఇచ్చాడు.

**5. సోషలిజం ఊహాజనితం–శాస్త్రీయం:** కమ్యూనిస్టు సాహిత్యంలో 'కమ్యూనిస్టు ప్రణాళిక' తరువాత అత్యంత ప్రాచుర్యం పొందిన, లెనిన్‌తో సహా అనేక మంది విప్లవ నేతలను ప్రభావితం చేసిన గ్రంథమిది. నిజానికి ఇది "డుహ్‌రింగ్ సిద్ధాంత ఖండన" గ్రంథంలోని కొన్ని భాగాలను తీసి ప్రత్యేకంగా వేసిన పుస్తకం. డుహ్‌రింగ్ పుస్తకంలోని 'సోషలిజం' అన్న అధ్యాయంలోని రెండు ప్రకరణలనూ, దాని ఉపోద్ఘాతాన్నీ కలిపి ఒక పుస్తకంగా వేశారు. 1880లో దీన్ని ఫ్రాన్స్‌లో ప్రచురించగా, ఆంగ్ల అనువాదం 1892లో వెలువడింది. ప్రపంచంలోని అనేక భాషల్లో, అనేక సార్లు, అనేక అనువాదాలతో వెలువడిన ఈ పుస్తకం తెలుగులో కూడా బాగా ప్రాచుర్యం పొందింది. 'రాజకీయ అర్థశాస్త్రం' అనే పదానికి ఎంగెల్స్ ఈ పుస్తకంలో శాస్త్రీయమైన నిర్వచనం ఇచ్చాడు. "ఒక విస్తృతార్థంలో రాజకీయ ఆర్థికశాస్త్రం అంటే...మానవ సమాజపు భౌతిక జీవనావసరాల ఉత్పత్తి, సరఫరాలను నియంత్రించే సూత్రలకు సంబంధించిన విజ్ఞానశాస్త్రం. అందువల్ల రాజకీయ అర్థశాస్త్రం వాస్తవానికి 'చారిత్రక' విజ్ఞానశాస్త్రం.అది చరిత్రాత్మకమైన వస్తువుల గురించి అంటే నిరంతరం మార్పుచెందే వస్తువుల గురించి చెబుతుంది" అని ఎంగెల్స్ వివరించాడు.

**6. ప్రకృతి గతితర్కం (డయెలక్టిక్స్ ఆఫ్ నేచర్):** ప్రకృతిలో గతితార్కిక సూత్రాలు ఏ విధంగా పనిచేస్తున్నాయో తెలియజేసే ఈ పుస్తకాన్ని ఎంగెల్స్ పూర్తి చేయలేక పోయాడు. ఆనాటికి శాస్త్ర–సాంకేతిక అభివృద్ధిలో సాధించిన విజయాలను ప్రోదిచేసి వాటి ఆధారంగా ప్రకృతిలో గతితార్కిక పద్ధతి ఎలా పనిచేస్తున్నదో వివరించడానికి ఎంగెల్స్ ప్రయత్నించాడు. ఈ అంశాలకు సంబంధించి ఆయన 1972–82 మధ్య దశాబ్దం పాటు రాసుకున్న నోట్స్ రాత ప్రతులను ఆయన మరణానంతరం ఎడ్వర్డ్ బెర్న్‌స్టీన్ సేకరించి ప్రఖ్యాత శాస్త్రవేత్త అల్బర్ట్ ఐన్‌స్టీన్‌కు అందజేశాడు. ఆయన వాటిని చదివి ఎంగెల్స్ ప్రతిభను మెచ్చుకున్నాడు. కానీ అందులో సైన్సుకు సంబంధించిన కొన్ని అంశాలు కాస్త గందరగోళం అనిపించాయని పేర్కొన్నాడు. 1925లో మాస్కోలోని మార్క్స్–ఏంగెల్స్–లెనిన్ సంస్థ రాత ప్రతులను ప్రచురించింది. తరువాత 1939లో ప్రఖ్యాత జీవశాస్త్రవేత్త జెబిఎస్ హాల్డేన్ ముందుమాటతో ఈ పుస్తకం వెలువడింది. ఆ కాలంలోని విజ్ఞానశాస్త్ర కార్యాచరణను సరిగ్గా అర్థం చేసుకోకపోతే ఎంగెల్స్ రాసిన ప్రకృతి గతితర్కాన్ని అర్థం చేసుకోవడం కష్టం అని హాల్డేన్ రాశారు. ఎంగెల్స్ కాలంలో ప్రకృతి శాస్త్రాలు శీఘ్రంగా అభివృద్ధి చెందుతున్నాయి. ఈ ఆవిష్కరణలు ప్రకృతిలో భావవాదాన్ని ఎలా పూర్వపక్షం

చేస్తున్నాయో, గతితార్కిక భౌతిక వాదాన్ని ఎలా సమర్ధిస్తున్నాయో ఆయన వివరించాడు. ఈ గ్రంథంలోని ఒక భాగాన్నే "వానరుడు నరుడుగా మారిన పరిణామ క్రమంలో శ్రమ పాత్ర" అన్న చిన్న పుస్తకంగా వెలువచించారు.

**7. కుంటుంబం, స్వంత ఆస్తి, రాజ్యాంగ యంత్రాల పుట్టుక:** అమెరికాకు చెందిన మానవశాస్త్ర వేత్త (ఆంథ్రపాలజిస్టు) లెవిస్ హెన్రీ మోర్గన్ రాసిన పరిశోధనా గ్రంథం "ప్రాచీన సమాజం"పై మార్క్స్ రాసిన నోట్స్ ఆధారంగా ఎంగెల్స్ ఈ పుస్తకం రాశాడు. ఇందులో ఎంగెల్స్ సమాజ పరిణామాన్ని చారిత్రక భౌతికవాదం దృష్ట్యా వివరించాడు. మార్క్స్-ఎంగెల్స్ సిద్ధాంతీకరించిన చారిత్రక భౌతిక వాద సిద్ధాతాన్ని మోర్గన్ పరిశోధనలు ఎలా నిర్ధారిస్తున్నాయో ఆయన వివరించారు. సైద్ధాంతికంగా ఎంతో ప్రాధాన్యత గత ఈ పుస్తకం 1884లో ప్రచురించబడింది. ప్రపంచంలోని అన్ని ప్రధాన భాషల్లోకి అనువదించబడింది. ఇతర సామాజిక వ్యవస్థల మాదిరిగానే కుటుంబ వ్యవస్థ కూడా దీర్ఘ చరిత్ర గలదని ఇందులో పేర్కొన్నాడు. సామాజికాభివృద్ధితో బాటే అది కూడా మార్పు చెందుతూ వచ్చిందని చెప్పాడు. ఆదిమ కమ్యూనిస్టు సమాజంలో ఉత్పత్తి శక్తులు ప్రాథమిక దశలో ఉన్నప్పుడు తెగలు, గణాలు మహిళ ఆధిపత్యం కింద మాతృస్వామిక సమాజాలుగా ఉండేవని నిరూపించాడు. ఉత్పత్తి శక్తులు కొద్దికొద్దిగా పెరిగి, సంపద పెరిగడం, వ్యక్తిగత ఆస్తి విధానం ఆరంభం కావడంతో ఉత్పత్తిలో పురుషుని ప్రాధాన్యత పెరిగి మహిళ పెత్తనం త్రోసివేయబడిందని ఈ గ్రంథంలో ఎంగెల్స్ వివరించాడు. అలాగే గణ నిర్మాణ శిథిలాల నుండి ఏ విధంగా రాజ్యాంగ యంత్రం నిర్మించబడిందో తెలిపాడు.

**8. లుడ్విగ్ ఫ్యూయర్ బా-సంప్రదాయ జర్మన్ తత్వశాస్త్ర పరిసమాప్తి:** ఈ గ్రంథాన్ని ఎంగెల్స్ 1886లో ప్రచురించాడు. 40 ఏళ్ల క్రితం మార్క్స్-ఎంగెల్స్ కలిసి రాసిన 'జర్మన్ తాత్వికసిద్ధాం' గ్రంథంలోనే ఈ పుస్తకపు బీజాలు ఉన్నాయని ఎంగెల్స్ చెప్పాడు. జర్మన్ తత్వవేత్త హెగెల్ తత్వశాస్త్రంలో గతితార్కిక సూత్రాలను ప్రతిపాదించాడు. ప్రకృతి అంతా ఈ గతితార్కిక సూత్రాల ప్రకారం నడుస్తుందని ఆయన చెప్పాడు. కానీ ఆయన భావవాదాన్ని ఆశ్రయించాడు. లుడ్విగ్ ఫ్యూయర్ బా భౌతికవాద సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. కానీ ఆయన హెగెల్ గతితార్కిక సూత్రాలను తిరస్కరించాడు. ఇరువురి తాత్విక చింతనల్లోని లోపాలను విశ్లేషిస్తూ గతితార్కిక చారిత్రక భౌతికవాద సిద్ధాంతాన్ని ఎంగెల్స్ ఈ గ్రంథంలో శాస్త్రీయంగా ప్రతిపా దించాడు.

ఇవి కాకుండా 1846 నుండి 1883లో మార్క్స్ మరణం వరకు మార్క్స్-ఎంగెల్స్ మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాల్లో వారు తాత్విక, ఆర్థిక, రాజకీయ, సామాజిక, వైజ్ఞానిక విషయాలపై చర్చించిన అంశాలు ఒక మహా గ్రంథం అయింది.

## శ్రామికోద్యమాల్లో ప్రత్యక్ష కార్యాచరణ

ఎంగెల్స్ శ్రామిక వర్గ సిద్ధాంత రూపశిల్పి మాత్రమే కాదు ఆయన గొప్ప విప్లవ కారుడు. నిర్మాణ దక్షుడు. విప్లవ పోరాటాల్లోనూ, శ్రామిక వర్గ పార్టీ నిర్మాణం లోనూ ప్రత్యక్షంగా పాల్గొన్నాడు. 1948-49 విప్లవాల్లో ఆయన స్వయంగా ఆయుధం చేబూని సేనానాయకుడిగా విప్లవ పోరాటంలో పాల్గొన్న విషయం ఇంతకు ముందే చెప్పుకున్నాం. అంతకు ముందు కమ్యూనిస్టు లీగ్ ఏర్పాటులో కూడా ఆయన ప్రధాన పాత్ర పోషించాడు. అయితే మాంచెస్టర్ వెళ్లి కుటుంబ వ్యాపారంలో చేరిన తరువాత ఆ సంస్థతో సంబంధాలు తెగిపోయాయి. తిరిగి సోషలిజం స్థాపన లక్ష్యంగా 1964లో మార్క్స్ నేతృత్వంలో అంతర్జాతీయ కార్మిక సంస్థ (మొదటి ఇంటర్నేషనల్) ఏర్పడి నప్పుడు ఎంగెల్స్ దానికి సీనియర్ సలహాదారుగా పనిచేశాడు. 20 ఏళ్లు మాంచెస్టర్‌లో పని చేశాక మార్క్స్‌కు దగ్గరగా ఉండాలన్న ఉద్దేశంతో లండన్‌కు మకాం మార్చాడు. మొదటి ఇంటర్నేషనల్ కౌన్సిల్ సభ్యుడయి చురుకుగా పనిచేశాడు. ప్రపంచ వ్యాపితంగా సోషలిస్టు పార్టీలు, గ్రూపులతో సంప్రదించే బాధ్యత తీసుకున్నాడు. అరాచకవాదుల విచ్ఛిన్న కార్యకలాపాల వల్ల మొదటి ఇంటర్నేషనల్ 1872లో విచ్ఛిన్నమై 1876లో పూర్తిగా రద్దు కావడంతో ఎంగెల్స్ జర్మన్ సోషలిస్టు పార్టీని గైడ్ చేయనారంభించాడు.

1883 మార్చి 14న... తన ప్రాణస్నేహితుడు, సిద్ధాంత, కార్యాచరణల్లో విడదీయలేని భాగం అయిన కారల్ మార్క్స్ మృతి ఎంగెల్స్ జీవితానికి ఒక పెద్ద విఘాతం. మార్చి 17వ తేదీన లండన్‌లోని హైగేట్ స్మశాన వాటికవద్ద భార్య జెన్నీ సమాధి పక్కనే మార్క్స్ భౌతిక కాయాన్ని ఖననం చేశారు. ఆ సందర్భంగా హాజరైన కొద్ది మంది మేధావులనుద్దేశించి ఎంగెల్స్ ఉద్విగ్నభరితమైన ప్రసంగం చేశాడు: "మార్చి 14వ తేదీ మధ్యాహ్నం పావుతక్కువ మూడు గంటలకు జీవించి ఉన్న ఒక గొప్ప ఆలోచనాపరుడు ఆలోచించడం ఆపేశాడు. రెండు నిముషాలు ఆయనను వదిలి బయటకు వెళ్లాం. తిరిగి మేము వచ్చేసరికి ఆయన ప్రశాంతంగా నిద్రిస్తున్నాడు. కానీ అది శాశ్వత నిద్ర. ఆయన మరణం ఐరోపా, అమెరికాలోని మిలిటెంట్ కార్మిక వర్గానికీ, అన్నిటికీ మించి చారిత్రక విజ్ఞానశాస్త్రానికీ పూడ్చలేని లోటు...డార్విన్ ప్రకృతిలోని జీవులకు చెందిన అభివృద్ధి సూత్రాలను కనుగొన్నట్లే మార్క్స్ మానవ చరిత్రకు చెందిన అభివృద్ధి సూత్రాలు కనుగొన్నాడు...ఇది మాత్రమే కాదు మార్క్స్, నేటి పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానాన్నీ, ఈ ఉత్పత్తి విధానం సృష్టించిన బూర్జువా సమాజాన్నీ నియంత్రిస్తున్న ప్రత్యేక గతి సూత్రాన్ని కనుగొన్నాడు... ఇటువంటి రెండు ఆవిష్కరణలు ఒక జీవితకాలానికి చాలు....మార్క్స్ అన్నిటికీ మించి గొప్ప విప్లవకారుడు. ఏదో విధంగా పెట్టుబడిదారీ సమాజాన్నీ, అది సృష్టించిన సంస్థలనూ

కూలదోయడం, కార్మిక వర్గ విముక్తికి దోహదం చేయడం ఆయన జీవితాశయం.... జీవించిఉన్న కాలంలో మార్క్స్ అత్యంత ఎక్కువగా ద్వేషింపబడ్డాడు. నిరంకుశ, రిపబ్లికన్ దేశాలు రెండూ ఆయనను తమ దేశాలనుండి బహిష్కరించాయి. మితవాద, ప్రజాస్వామిక– రెండు రకాల బూర్జువాలూ ఆయనపై తిట్ల దండకం చదవడానికి పోటీపడ్డారు. మరీ అవసరం అయితేనే మినహా స్పందించకుండా వీటిని ఆయన పక్కనబెట్టేశాడు. అటువంటి ప్రేమాస్పదుడు, గౌరవప్రదుడు అయిన మార్క్స్ చనిపోయాడు. సైబీరియా నుండి కాలిఫోర్నియా వరకు, ఐరోపా, అమెరికాల్లో అన్ని ప్రాంతాలకు చెందిన లక్షలాది మంది విప్లవ కార్మికులు ఆయన మృతికి సంతాపం తెలుపుతున్నారు. నేను ధైర్యంగా ఒక్క విషయం చెప్పగలను. ఆయనకు అనేకమంది వ్యతిరేకులుండవచ్చుగాక కానీ వ్యక్తిగత శత్రువు ఒక్కడు కూడా లేడు...ఆయన పేరూ, దాంతో బాటు ఆయన చేసిన కృషీ యుగయుగాలుగా చెరిగిపోకుండా ఉంటుంది."

మార్క్స్ చనిపోవడంతో ఎంగెల్స్ మీద మరింత భారం పడింది. మార్క్స్ విడిచిపెట్టిన సైద్ధాంతిక కృషిని కొనసాగించడమే కాదు, ఉద్యమాన్ని కూడా ఎంగెల్స్ ముందుకు తీసుకుపోవలసి వచ్చింది. మార్క్స్ మొదటి ఇంటర్నేషనల్ ఏర్పాటు చేసి సుమారు పదేళ్ల పాటు దానికి నాయకత్వం వహించాడు. ఆయన చనిపోయిన తరువాత ఎంగెల్స్ కృషి వల్ల 1889లో రెండవ ఇంటర్నేషనల్ ఏర్పడింది. దాన్ని విస్తరింప జేయడానికి ఎంగెల్స్ ఎంతో కృషి చేశాడు. అయితే ఇది కూడా మితవాద సోషలిస్టుల చేతుల్లో పడి నిర్వీర్యమై చివరికి విప్లవ వ్యతిరేక సంస్థగా మారింది. ఎంగెల్స్ మరణానంతరం 1904లో అది రద్దయింది.

## ఎంగెల్స్ వైవాహిక జీవితం

ఎంగెల్స్ 22 ఏళ్ల ప్రాయంలో మాంచెస్టర్‌లోని కుటుంబ నూలుమిల్లులో పనిచేస్తున్నప్పుడు మేరీ బర్న్స్ అనే యువతితో పరిచయం ఏర్పడింది. ఐరిష్ కార్మిక కుటుంబం నుండి వచ్చిన మేరీ స్వతంత్ర వ్యక్తిత్వం, అభ్యుదయ భావాలు కలది. ఆమె ఎంగెల్స్ ఫ్యాక్టరీలో పనిచేసేది. ఎంగెల్స్ ఆమెను ప్రేమించాడు. ఇరువురూ 20 సంవత్సరాలు సహజీవనం చేశారు. వివాహం చేసుకోలేదు. వివాహ వ్యవస్థ పట్ల ఇద్దరికీ వ్యతిరేకత ఉండేది. అయితే ఒకే వ్యక్తితో కలిసి జీవించాలని కోరుకునేవారు. వివాహం అనేది చర్చి నియంత్రణలో జరిగే ఒక రకమైన పీడనకు ప్రతినిధిగా వారు భావించారు.

ఎంగెల్స్ అధ్యయనానికి మేరీ బాగా తోడ్పడింది. ఆమె మాంచెస్టర్, సల్ఫోర్డ్‌లో కార్మికవాడలకు ఎంగెల్స్‌ను తీసుకుపోయి అక్కడి దుర్భర పరిస్థితుల్లో నివసిస్తున్న కార్మికుల జీవనాన్ని చూపించేది. ఆమె ఎంగెల్స్‌కు తోడునీడగా ఉంది. అయితే అకస్మాత్తుగా గెండెపోటు వల్ల 1863 జనవరి 7వ తేదీన ఆమె మరణించింది. ఈ

నష్టం ఎంగెల్స్‌ను చాలా కాలం కలచివేసింది. మేరీ బర్న్స్ చనిపోయాక ఆమె సోదరి లిజ్జీ బర్న్స్ ఎంగెల్స్ జీవితంలోకి ప్రవేశించింది. ఆమె కార్యరంగంలో ఎంగెల్స్‌కు చేదోడువాదోడుగా ఉండటమే కాదు ఆయన ఆశయాలకు తానూ అంకితమై ఐర్లాండు స్వాతంత్ర్యం కోసం జరిగి ఉద్యమంలో ఆమరణాంతం పనిచేసింది. 1864 నుండి 1878 వరకు వారి దాంపత్యం కొనసాగింది. 1878 సెప్టెంబర్ 11న లిజ్జీ చని పోయింది.

## కవి, కళాకారుడు ఎంగెల్స్

ఎంగెల్స్ మంచి కవి, చిత్రకారుడు కూడా. నిజానికి పత్రికల్లో ప్రచురితమైన ఆయన మొదటి రచన "ఎడారి దిమ్మరులు" (ది బెడౌన్) అనే ఒక కవిత. ఎంగెల్స్ 18వ ఏట రాసిన ఈ కవిత 1838 సెప్టెంబర్‌లో 'బ్రెమిషెస్ కాన్వర్సేషన్ బ్లాట్' అనే స్థానిక పత్రికలో ప్రచురితమైంది. "కంచు ఘంటికలు గణగణ మోగెను, పట్టు యవనికలు పరపర లేచెను! సరసత తెలిసిన సదస్యులందరు సాయంకాలపు కార్యక్రమాన్ని స్వాగతించారు కుతూహలంతో..." అంటూ సాగే ఈ కవిత ఉత్తరాఫ్రికాలో నివసించే బెడౌన్ తెగల కళాకారులపై రాసింది.

"పుస్తకాలను మాత్రమే చదివి,
పనికి మాలిన పరిజ్ఞానం పోగేసేవాడు,
విజ్ఞత కలిగిన వివేకి మాత్రం కాలేడు!
ఎందుకంటే, నిగూఢ జీవన రహస్యం,
అతగాడికి అర్థంకాని ఓ మూసిన పుస్తకం!.."

అని 1839లో "పలుకు చిలుకల తెలివి" అనే కవితలో ఎంగెల్స్ రాశాడు.

ఎంగెల్స్ కవి మాత్రమే కాకుండా చిత్ర కారుడు కూడా. తను రాసే వ్యాసాలకు తనే స్వయంగా చిత్రాలు, స్కెచ్‌లు గీసేవాడు.

## ముగింపు

మానవ కల్యాణానికి మహత్తర కృషి చేసిన ఫ్రెడరిక్ ఎంగెల్స్ 1895వ సంవత్సరం ఆగస్టు 5వ తేదీన 75 ఏళ్ల వయసులో వృద్ధాప్య సమస్యలతోపాటు గొంతు క్యాన్సర్ వల్ల తుదిశ్వాస విడిచాడు. పుట్టుకతో సంపన్నుడైనప్పటికీ కార్మికవర్గ స్థితిగతులు అధ్యయనం చేసి వారి విముక్తికోసం సైద్ధాంతికంగా, ఆచరణలోనూ జీవితపు చివరి నిమిషం వరకు శ్రమించిన మహోన్నత మానవతామూర్తి ఎంగెల్స్. కారల్ మార్క్స్‌తో కలిసి ఆయన సృష్టించిన శ్రామిక వర్గ సిద్ధాంతం మాదిరిగానే ఆయన పేరు కూడా మానవాళి స్మృతిలో చిరస్థాయిగా నిలిచిపోతుంది.

# సైన్సు, సోషలిజంపై ఏంగెల్స్ భావాలు

**- ఎస్. చటర్జీ**

1842లో ఫ్రెడరిక్ ఎంగెల్స్‌ను ఆయన కుటుంబ సభ్యులు ఇంగ్లండులో టెక్స్‌టైల్ పరిశ్రమలకు పేరెన్నికగన్న మాంచెస్టర్‌కు పంపారు. అక్కడ వారి కుటుంబానికి చెందిన టెక్స్‌టైల్ పరిశ్రమలో పని నేర్చుకోడానికి. అప్పటికి ఎంగెల్స్ వయసు 22 సంవత్సరాలు. ఎంగెల్స్ స్వస్థలం జర్మనీలోని బర్మన్ నగరం. అప్పటికి పారిశ్రామికంగా వెనుకబడి ఉన్న జర్మనీలో అది టెక్స్‌టైల్ ఉత్పత్తుల నగరమే అయినా ఆధునిక పారిశ్రామికోత్పత్తి గురించీ, వ్యాపారం, యాజమాన్య పద్ధతుల గురించీ తెలుసుకోవాలన్న ఉద్దేశంతో ఎంగెల్స్‌ను మాంచెస్టర్‌కు పంపించారు. దీంతోపాటు ఫ్రాన్స్ నుండి జర్మనీలోకి చొరబడిన విప్లవ కార్యకలాపాలకు ఎంగెల్స్‌ను దూరంగా ఉంచాలన్న ఆలోచన కూడా ఆయన కుటుంబానికి ఉంది.

వారి ఆలోచనకు అనుగుణంగానే ఎంగెల్స్ వాణిజ్య, పారిశ్రామిక యాజమాన్య పద్ధతులను చాలా నిష్టతో నేర్చుకున్నాడు. మధ్యతరగతి మందుపార్టీలు, డిన్నర్ పార్టీలూ విడిచిపెట్టి ఖాళీ సమయమంతా కార్మికులతో కలుస్తూ, వారి కష్టసుఖాలు తెలుసుకుంటూ గడిపేవాడు. ఆ విధంగా ఆయన కార్మికవర్గ పరిస్థితుల గురించి క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా అధ్యయనం చేశాడు. గణాంకాలు, సంఖ్యల విషయంలో చాలా జాగ్రత్త వహించేవాడు. స్కెచ్‌లు, డ్రాయింగులు తనే వేసుకునే వాడు. (తరువాతి కాలంలో మార్క్స్ ఒత్తిడి మేరకు ఆయన 1843లో "ఇంగ్లండులో కార్మికవర్గ స్థితిగతులు" అన్న పుస్తకం రాశాడు.) ఐర్లాండ్ కార్మికవర్గం నుండి వచ్చిన మేరీ బర్న్స్ ఎంగెల్స్‌కు ఈ విషయంలో మార్గదర్శనం చేసింది. అందువల్ల కార్మికుల పరిస్థితి ఎంత దయనీయంగా, నిరాశానిస్పృహలతో కూడి ఉండేదో ఆయన తెలుసుకున్నాడు. అనేక కోణాల నుండి ఆయన కార్మిక వర్గ జీవితాన్ని అధ్యయనం చేశాడు. పని పరిస్థితులు, యంత్రాల వినియోగం, కార్మికుల దయనీయమైన స్థితి, మహిళలు, పిల్లల పరిస్థితి, కార్మికుల ఆరోగ్యం, పరిశుభ్రత, చదువుల పట్ల పెట్టుబడిదారుల నిర్లక్ష్య పూరిత వైఖరి మొదలైన అనేక కోణాలను

అధ్యయనం చేశాడు. అవే కాకుండా నేరాలు, నైతికత, వ్యభిచారం, సుఖవ్యాధులతో మరణాలు వంటి అనేక అంశాలను కూడా ఆయన పరిశీలించాడు. కార్మికవర్గం ఇటువంటి దుర్భర పరిస్థితుల్లో నివసిస్తూ ఉంటే ధనిక వర్గం సంపదను విపరీతంగా పోగుచేసుకుంటుండేది.

ఇంగ్లండు ప్రజల జీవితాల్లో ఒకదానికొకటి సంబంధం లేనట్టు కనిపించే అంతస్సంబంధాలను కనిపెట్టడానికి ఆయన ప్రయత్నించాడు. అదే సైన్సులో ఆయనకు మొట్టమొదటి శిక్షణ. తన చుట్టూ ఉన్న జీవితం నుండి ఆయన దాన్ని తనంత తానుగా నేర్చుకున్నాడు. ఒక వైపు ఈ అధ్యయనం చేస్తూనే ఎంగెల్స్ పారిశ్రామిక పూర్వపు ఇంగ్లీషు వారి జీవితం ఎలా ఉండేదో పరిశోధన చేశాడు. ఆనాడు "గ్రామీణ వృత్తిదారుల జీవితం పచ్చని వృక్ష సంపద మధ్య సౌఖ్యవంతంగా ఉండేది. పారిశ్రామిక విప్లవం జరగకపోయి ఉంటే వారు అటువంటి సుఖప్రదమైన జీవితం నుండి బయటపడేవారు కాదు. అయినప్పటికీ ఆ జీవితం మానవులు నివసించదగ్గ జీవితం కాదు, ఎందుకంటే మేధోపరంగా వాళ్లు చనిపోయినట్లే" అని ఎంగెల్స్ రాశాడు. అంతేకాదు "అరవై, ఎనభై ఏళ్ల క్రితం ఇంగ్లండు కూడా ఇతర చిన్న పట్టణాల మాదిరిగానే ఉండేది. ఆ పట్టణాల్లో చిన్నపాటి పరిశ్రమలు కొద్దిగా ఉండేవి. జనాభా తక్కువ. వారిలో కూడా వ్యవసాయంపై ఆధారపడేవారు ఎక్కువ. కానీ నేడు అది దేనితోనూ పోల్చలేని దేశంగా ఎదిగింది. దాని రాజధాని నగరమైన లండన్‌లో 25 లక్షల జనాభా ఉన్నారు.... ఇటువంటి పారిశ్రామిక పరివర్తన ఫలితంగా ఇంగ్లాండు కార్మికవర్గం ఏర్పడింది" అని ఆయన రాశాడు.

ఈ క్రమం అంతా కూడా 1764లో ప్రవేసించిన 'జెన్నీ' అనే యంత్రం వల్ల జరిగింది అని ఎంగెల్స్ గుర్తించాడు. "సాధారణ పత్తి స్పిన్నింగ్ రాట్నంలో ఒక్క కుదురు (స్పిండిల్) ఉంటే ఈ జెన్నీ యంత్రంలో 16 లేక 18 కుదుళ్లు ఉంటాయి. ఆ యంత్రం వద్ద ఒకే కార్మికుడు పనిచేస్తాడు. గతంలోని గ్రామీణ చేనేత కార్మికుడు మాయమైపోయాడు" అని ఎంగెల్స్ పేర్కొన్నాడు. పారిశ్రామిక విప్లవానికి తోడ్పడిన మరో పెద్ద ఆవిష్కరణ 'ఆవిరి యంత్రం'. ఆనాడు ప్రజల్లో నానుడిలో ఉన్న ఒక పద్యాన్ని ఎంగెల్స్ పేర్కొన్నాడు.

"ఒక రాజు ఉండేవాడు,<br>
మహా క్రూరుడు,<br>
కవి కలల రారాజు కాడతడు;<br>
ప్రజాకంటకుడు,<br>
తెల్లటి బానిసలకు ఆవిషయం బాగా తెలుసు

ఆ ప్రజాకంటక రాజు పేరే ఆవిరి యంత్రం"

## ఆవిరి యంత్రం వెనుక సైన్సు

అయితే ఆవిరి యంత్రపు క్రూరత్వం అనేది కథలో ఒక భాగం మాత్రమే. దానికి మరో పార్శ్వం కూడా ఉంది. దీనిపై కొన్ని సంవత్సరాల తరువాత అంతర్జాతీయ వర్కింగ్‌మెన్స్ అసోసియేషన్ ఒక తీర్మానం చేసింది: "పెట్టుబడిదారీ వర్గం కార్మికులను నిరంకుశంగా దోపిడీ చేయడానికి యంత్రాలు శక్తివంతమైన సాధనాలుగా ఉపయోగ పడుతూనే మరోవైపు యంత్రాల అభివృద్ధి.. ఉత్పత్తిలో వేతన వ్యవస్థను నిర్మూలించడానికి అవసరమైన భౌతిక పరిస్థితులను కూడా సృష్టించింది" అని తీర్మానం పేర్కొంది. ఈ పారిశ్రామికీకరణ క్రమాన్ని ఎంగెల్స్ క్షుణ్ణంగా అధ్యయనం చేశాడు. 1843లో "ఇంగ్లండులో కార్మికవర్గ స్థితిగతులు" అన్న గ్రంథంలో ఎంగెల్స్ రాసిన విషయాలనే "కమ్యూనిస్టు ప్రణాళిక" క్రింది వాక్యాల్లో చెప్పింది: "బూర్జువా వర్గం తన వందేళ్ల పరిపాలనా కాలంలో అంతకుముందు తరాలన్నీ కలిసి సృష్టించనంతటి భారీ ఉత్పత్తి శక్తులను సృష్టించింది. ప్రకృతి శక్తులను మనిషికీ, యంత్రానికీ లోబడేట్లు చేసింది. పరిశ్రమలు, వ్యవసాయంలో రసాయనశాస్త్రాన్ని ప్రవేశపెట్టింది. ఆవిరి యంత్రంతో నడిచే ఓడలు, రేల్వేలు, విద్యుత్ టెలిగ్రాఫును ప్రవేశపెట్టింది. ఖండాలకు ఖండాలనే వ్యవసాయ క్షేత్రాలుగా మార్చేసింది. నదులకు కాల్వలు నిర్మించింది. మొత్తం జనాభాను ఉత్పత్తిలోకి తీసుకువచ్చింది. అంతకు ముందటి తరాలేవీ కూడా సామాజిక శ్రమ నుండి ఇంతటి మహత్తర ఉత్పత్తి శక్తులు ఉద్భవిస్తాయని ఊహించి ఉండవు."

తరువాతి దశలో ఎంగెల్స్ ఆవిరి యంత్రపు పరిణామ చరిత్రను అధ్యయనం చేశాడు. ఆవిరి యంత్రాన్ని ఏ ఒక్కరో కనుగొన లేదు, అది అంతర్జాతీయ ఆవిష్కరణ అని ఆయన నిర్ధారించాడు. ఈ యంత్రానికి సంబంధించిన తొలి ఆలోచనలు ఫ్రాన్స్‌లో బయలుదేరాయి. అక్కడి నుండి జర్మనీ ద్వారా ఇంగ్లండు చేరాయి. ఆ తరువాత జోసెఫ్ ఫొరీర్, సాది కార్నొట్, రిచర్డ్ వాన్ హెల్మ్‌హోజ్, రుడోల్ఫ్ క్లాసియస్, జె.సి. మాక్స్‌వెల్ మొదలైన వారి ఆవిష్కరణలు ఆవిరి యంత్రం సైన్సు వెనుక ఉన్నాయని ఏంగెల్స్ చెప్పాడు. "అందువల్ల యాంత్రిక చలనానికీ, ఉష్ణానికీ మధ్య ఉన్న సంబంధం గురించిన సమస్యను ఆచరణే పరిష్కరించింది" అని ఆయన తేల్చి చెప్పాడు.

పెట్టుబడిదారీ వ్యవస్థను అధ్యయనం చేయడంలో భాగంగా మార్క్స్-ఎంగెల్స్‌లు సైన్సు, సైన్సు చరిత్ర వంటి అనేక విషయాలు అధ్యయనం చేశారు. వీటిలో మార్క్స్ గణిత శాస్త్ర అధ్యయనాన్ని చేపట్టగా, ఏంగెల్స్ సైన్సు మీద కేంద్రీక రించాడు. ఇద్దరూ గతితార్కిక వాదులే. అందువల్లనే వారు ఈ శాస్త్రాలను పరిణామ క్రమంలో, వాటి మధ్య ఉన్న పరస్పర సంబంధాల ఆధారంగా అధ్యయనం చేశారు.

ఒక్క మాటలో చెప్పాలంటే ప్రతిదీ, చివరికి విజ్ఞానం కూడా ఒక పరిణామ క్రమంలోనూ, ఐక్యతలోనూ ఉంటుంది. ఈ విషయాల మీద ఎంగెల్స్ చేసిన తొలి రచన "యాంటీ డుహ్‌రింగ్" (1872–76). దీన్ని ఆయన యూజీన్ డుహ్‌రింగ్‌కు సమాధానంగా రాశాడు. డుహ్‌రింగ్ అభివృద్ధి నిరోధక, వక్రీకరణలతో కూడిన సిద్ధాంతాన్ని ప్రతిపాదించడమే కాకుండా ఈ క్రమంలో సోషలిజం భావాలనే ఖండించాడు. మార్క్స్ ఒప్పించడంతో ఎంగిల్స్ ఈ సవాలును స్వీకరించి డుహ్‌రింగ్‌కు సమాధానం రాశాడు.

సైన్సు మీద ఎంగెల్స్ భావాలను ఒక సమగ్ర రూపంలో మనకు ఆయన రాసిన "సోషలిజం : ఊహాజనితం, శాస్త్రీయం" (1880) అనే రచనలో కనిపిస్తాయి. మానవుల భౌతిక జీవన అభివృద్ధికీ, వారి ఆలోచనలకూ మధ్య అంతస్సంబంధంగానే సోషలిస్టు భావాలు ఏర్పడతాయన్న విషయాన్ని ఆయన ఇందులో వెల్లడించాడు. వర్గ సంబంధాలు సైన్సు అభివృద్ధికి పరిమితులు విధిస్తాయని ఆయన ఈ రచనలో వివరించాడు. అందువల్లనే, ప్రాచీన గ్రీసులో బానిస యజమానుల వర్గానికి ఎంతటి తీరిక ఉన్నప్పటికీ వారు ఇతర సమాజాలు తమ ప్రత్యక్ష అనుభవం ద్వారా సంపాదించిన జ్ఞానాన్ని ఒక క్రమపద్ధతిలో పెట్టారే మినహా "గ్రీకులు స్వంతంగా ఎటువంటి ప్రత్యక్ష అనువపూర్వక సైన్సునూ" అభివృద్ధి చేయలేకపోయారు అని ఎంగెల్స్ తెలిపాడు.

అందువల్లనే గ్రీకు సైన్సు అనివార్యంగా కుప్పకూలిపోయింది. "15వ శతాబ్దం రెండో భాగం నుండి నిజమైన సైన్సు అభివృద్ధి చెందింది. అప్పటి నుండి అది మరింత వేగంగా పెరుగుతూ వస్తోంది" అని ఎంగెల్స్ తెలిపాడు. ఈ కాలంలో ప్రకృతిని గురించి అనేక ఆవిష్కరణలు జరగడమే కాదు భౌతిక వాదానికి సంబంధించిన స్పష్టమైన భావాలు కూడా ఈ కాలంలోనే ఆవిర్భవించాయి. ఫ్రాన్సిస్ బేకన్, జాన్ లాకె, థామస్ హాబ్బెస్, క్రిస్టియన్ వోల్ఫ్ వంటి వారు ఈ భావాలను వ్యక్తం చేశారు. ప్రాచీన గ్రీకుల్లో గానీ, ఆ తరువాత వారుగానీ వ్యక్తం చేసిన భౌతికవాద భావాలకు పరిశోధన, అధ్యయనం, అనుమానం అన్నవాటిపై ఆధారపడ్డ శాస్త్రీయ ధృవీకరణలు లేవు. కోపర్నికస్ గ్రహభ్రమణ సిద్ధాంతం సైన్సుకు ఒక మూలమలుపు. ఆ తరువాత, పరిశీలకునితో సంబంధం లేకుండా "విశ్వజనీన ప్రకృతి సూత్రాలు" ఉంటాయన్న విషయం తెలిసివచ్చింది. కోపర్నికస్ గ్రహభ్రమణ సిద్ధాంతం తరువాత గెలీలియో, జోహెన్నస్ కెప్లర్, ఐజాక్ న్యూటన్, ఎడ్మండ్ హేలే, పీర్రె సైమన్ లాప్లాస్‌ల పరిశోధనలను బట్టి భూమ్మీద వర్తించే సూత్రాలే, భూమికి బయట కూడా పనిచేస్తాయని తెలిసింది. ఉదాహరణకు, భూమ్మీద పనిచేసే గురుత్వాకర్షణ శక్తే గ్రహాలు తమ కక్ష్యల్లో తిరగడానికీ, చంద్రుని గురుత్వాకర్షణ వల్ల సముద్రంలో ఆటుపోట్లు ఏర్పడ్డానికీ కారణమని తెలిసింది. ఇక అక్కడి నుండి వెనక్కు తిరిగి చూసే అవసరమే లేకుండా పోయింది. గణిత

సూత్రాల ద్వారా నెప్ట్యూన్ గ్రహాన్ని అర్బయిన్ లె లెవెర్రీ కనుగొనడం, విలియం హెర్షెల్ నక్షత్ర మండలాలనూ, నెబ్యులాలనూ, ఇమ్మాన్యుయెల్ కాంట్ మన పాలపుంత గెలాక్సీకి బయట అనేక గెలాక్సీలను కనుగొనడం... వీటన్నిటినీ భౌతికవాదంలో పెద్ద ముందంజలుగా పేర్కొనవచ్చు. ఎంగెల్స్ వీటిని చాలా జాగ్రత్తగా సమీక్షించాడు. గత శతాబ్ద కాలంలో విశ్వంలో అటువంటి కొత్త పదార్థాలను అనేక రెట్లు ఎక్కువగా కనుగొన్నారు. ఈ విధంగా కనుగొనే అవకాశాలు ఉన్నాయని ఎంగెల్స్ తను రాసిన 'ఆధునిక రసాయన శాస్త్ర ప్రారంభం' అనే నోట్‌లో పేర్కొన్నాడు.



కారల్ మార్క్స్, ఆయన భార్య జెన్నీ కుమార్తెలు లారా, ఎలినార్‌లతో ఎంగెల్స్

ఎంగెల్స్ జీవించిన కాలంలో పారిశ్రామిక విప్లవం వల్ల సైన్సు అనేక దిశల్లో అభివృద్ధి చెందింది. అప్పటి కాలంలో చలనం ఎలా సంభవిస్తుందో న్యూటన్ సూత్రాలు చెప్పాయి. కానీ ఆవిరి యంత్రం గురించీ, ఉష్ణ శక్తిని యాంత్రిక శక్తిగా మార్చగల దాని శక్తిని గురించీ వివరించడానికి కొత్త రకం సైన్సు అవసరమైంది. "పదార్థం లోపల దాగున్నదేమిటి? దాన్ని కాల్చగానే ఉష్ణం ఉత్పత్తి అవుతోంది. ఉష్ణం ఆవిరిని ఉత్పత్తి చేస్తోంది. ఆవిరి పిస్టన్‌ను ముందుకు తోయడం ద్వారా యంత్రాన్ని నడిపిస్తోంది. ఇవన్నీ ఒకదానిపై ఆధారపడి మరొకటి ఎలా జరుగుతున్నాయి" అన్న ప్రశ్నకు సైన్సు సమాధానాలు చెప్పాల్సి వచ్చింది. ఈ ప్రశ్నలు సైన్సును రెండు మార్గాలకు నెట్టాయి. మొదటిది, శక్తి వివిధ ప్రక్రియల మధ్య మార్పు చెందడాన్ని అర్థం చేసుకోవడం. ఉదాహరణకు:– పైన చెప్పుకున్నట్లు రసాయన ప్రకియ నుండి ఉష్ణానికీ దాని నుండి యాంత్రిక ప్రక్రియకూ మారడం. అంతే కాకుండా శక్తి ఒక రూపం నుండి మరో రూపంలోకి మారుతుందని కూడా తెలిసింది. రెండోది, దహన క్రియ (కంబషన్)కు సంబంధించిన సైన్సును అధ్యయనం చేయడం. ప్రతిదీ దహనం కాదన్న విషయం స్పష్టమే. అదే విధంగా ఆక్సిజన్ లేకుండా ఏదీ దహనం కాదన్న విషయమూ స్పష్టమే. మరలాంటప్పుడు "దహనం చెందే వస్తువుల్లో ఉన్న ప్రత్యేక ఏమిటి?" ఈ ప్రశ్నకు సమాధానం, ఆధునిక అణునిర్మాణం మీద ఆధారపడ్డ ఆధునిక రసాయన శాస్త్ర

ప్రారంభానికి మైలురాయిగా నిలిచింది.  ఇందులో ఆంటోనియో లావోయ్‌సీర్, హెన్రీ కావెండిష్, జోసెఫ్ ప్రీస్‌ట్లీ, జాన్ డాల్టన్‌లు ప్రారంభ పరిశోధనలు చేయగా 1869లో మెండలీవ్, పీరియాడిక్ టేబుల్‌ను కనుగొనడంతో ఇది ఉచ్ఛ స్థితికి వెళ్లింది. పీరియాడిక్ టేబుల్ కనుగొనడం మహత్తర ఆవిష్కరణ అని ఎంగెల్స్ కొనియాడాడు. "పరిణామాత్మక మార్పు గుణాత్మక మార్పుగా పరివర్తన చెందుతుందన్న హెగెల్ సూత్రాన్ని వర్తింపజేయడం ద్వారా మండలీవ్ – తెలియని దాన్నుండి అనేక మూలకాలను కనిపెట్టాడు. ఈ శాస్త్రీయ అద్భుత కృత్యాన్ని మనం... కేవలం గణాంకాల ద్వారా అప్పటికి ఎవరికీ తెలియని నెప్ట్యూన్ గ్రహ కక్ష్యను లెవెర్రీ కనుగొన్న కృత్యంతో పోల్చవచ్చు" అని ఎంగెల్స్ పేర్కొన్నాడు.  అసలు ప్రశ్న ఏమంటే అసలిలా ఎందుకు జరుగుతోంది?

ఇది తెలుసుకోవాలంటే మనం రసాయనశాస్త్ర స్థితిని గురించి తెలుసుకోవాలి. ఒక్క మాటలో చెప్పాలంటే ఎగెంల్స్ కాలంలో రసాయనశాస్త్రం రసవాదం (అల్కెమీ) నుండి విడగొట్టుకోడానికీ, ఇంజినీరింగు అనుభవవాదం (ఎంపిరిసిజం) నుండి విడగొట్టుకోడానికీ, తమ స్వంత సైన్సులు ఏర్పాటు చేసుకోడానికీ పెనుగులాడుతున్నాయి. అదే సమయంలో సైన్సు కూడా పురాణాల (థియాలజీ)కు వ్యతిరేకంగా పోరాడుతోంది. ఇవన్నీ కూడా భౌతికవాదాన్ని ఒక కొత్త స్థితికి తీసుకుపోయాయి. అంటే, పదార్థం లోపలి చలనాల వల్ల ఉష్ణం ఏర్పడుతుందనీ,  ఆ పదార్థం చలిస్తున్నదా, లేక స్థిరంగా ఉన్నదా అనే దానితో నిమిత్తం లేకుండా ఈ చలనాలు ఆ పదార్థంలో ఉంటాయన్న విషయాన్ని తెలుసుకోవడం ద్వారా భౌతికవాదం మరింత పరిపుష్టమైంది. తరువాతి కాలంలో పరమాణువుల అంతర్గత నిర్మాణాన్ని కనుగొనడంతో ఈ చలనాలు విభిన్న స్థాయిల్లో ఎలా సంభవిస్తున్నాయో అర్థం చేసుకోగలిగాం; వస్తువులకు ఉన్న విద్యుత్, అయస్కాంత, దృశ్య లక్షణాలను వివరించగలిగాం. కానీ ఇదంతా ఎగెంల్స్ చనిపోయిన చాలా కాలం  తరువాత 20వ శతాబ్దపు సైన్సులో వచ్చిన విప్లవం వల్ల సాధ్యమైంది.

పదార్థం లోపల జరిగే భౌతిక చలనాల సంక్లిష్టతను అర్థం చేసుకోవడం చాలా అవసరం అని ఎంగెల్స్ గుర్తించాడు. ఈ చలనాల వైవిధ్యం, సంక్లిష్టత చాలా కాలం వరకు అంతుచిక్కని సమస్యగానే ఉండింది. కానీ ఎంగెల్స్ మాత్రం వీటిని అర్థం చేసుకోడానికి ప్రయత్నించాడు. భౌతిక, రసాయన శాస్త్రాల్లో ఆనాటికి తెలిసిన సూత్రాలను సరళమైన రీతిలో అంచనా వేయడం ద్వారా, గణించడం ద్వారా తన స్వంత భావాలను బేరీజువేసుకున్నాడు. అంటే "నిర్దిష్టమైన శాస్త్రాల్లో పరిమాణాలను ఖచ్చితంగా కొలవగలం, కనుగొనగలం" అని పేర్కొన్నాడు.

ఎంగెల్స్ కాలంలో సైన్సు మనకు తెలియని అనేక మార్గాలు పట్టేది. ఉదాహరణకు, విద్యుత్ శాస్త్రం పరిపక్వ స్థితికి చేరుకుంటున్నది. ఈ అద్భుతాల్లో

కొట్టుకుపోకుండానే వాటి వివరాలను సేకరిస్తూ ఎంగెల్స్ ఒక ప్రశ్న వేశాడు: ఐక్యత ఏ విషయాల్లో ఉంటాయి? అవి ఎక్కడ విబేధిస్తాయి? ఎంగెల్స్ మరణించిన చాలా కాలం తరువాత 1925లో ప్రచురించబడిన "ప్రకృతి గతితర్కం" (డైఎలక్టిక్స్ ఆఫ్ నేచర్) గ్రంథంలో ఆయన ఇటువంటి అనేక ప్రశ్నలు సంధించాడు. వీటన్నిటికీ ఆయన ఒకే ఒక మాటలో సమాధానం చెబుతూ "శరీరధర్మశాస్త్రం అనేది జీవి శరీరంలోని భౌతిక శాస్త్రం, మరీ ముఖ్యంగా రసాయన శాస్త్రం" అన్నాడు. అదే సమయంలో ఆయన లుడ్విగ్ ఫ్యూయెర్ బా అంతకు ముందే చెపినట్లు "అయితే జీవి అనేది కేవలం రసాయన ప్రక్రియ కాదు, లేదా యాంత్రిక భౌతికవాదులు పేర్కొనేట్లు అది ఒక విడిగా ఉన్న (ఐసొలేటెడ్) ప్రకృతి శక్తో, లేక దృగ్విషయమో కాదు. అది మొత్తం ప్రకృతి యొక్క ఫలితంగా ఏర్పడింది" అని ఎంగెల్స్ చెప్పాడు.

## జాతుల పరిణామం

డార్విన్ కనుగొన్న జాతుల పరిణామ పరిశోధన మార్క్స్-ఎంగెల్స్ మీద తీవ్రమైన ప్రభావం కలిగించింది. అప్పటివరకు టెలియోలజీ గురించి... అంటే అతీతమైన మేధోశక్తిచేత సృష్టి జరిగింది అన్న విషయమై వారి మధ్య జరిగిన చర్చకు డార్విన్ సిద్ధాంతం ఫుల్‌స్టాప్ పెట్టింది. ఎంగెల్స్ తన "ప్రకృతి గతితర్కం" గ్రంథంలో జీవశాస్త్రం మీద అనేక ముఖ్యమైన వ్యాఖ్యలు చేశాడు. నిజానికి ఇది 1872 నుండి 1882 వరకు ప్రకృతి శాస్త్రంపై ఎంగెల్స్ రాసిన నోట్స్‌ను ఒక చోట చేర్చి వేసిన పుస్తకం. ఈ గ్రంథంలో ఆయన డార్విన్ ప్రతిపాదించిన మనుగడకోసం పోరాటం వల్ల జరిగే ప్రకృతి వరణం (నేచురల్ సెలెక్షన్) అనేది జీవి బయట సంభవించే గతితర్కం కదా! మరి జీవి లోపల ఏం జరుగుతుంది అనే విషయాన్ని గురించి ప్రశ్నించాడు.

## ప్రకృతి గతితర్కం (డైయలెక్టిక్స్ ఆఫ్ నేచర్)

'ప్రకృతి గతితర్కం' గ్రంథం చాలా మందికి స్ఫూర్తినిచ్చింది. కానీ అనేక మంది దీన్ని విమర్శించారు కూడా. ఇందులో ఎలాంటి ఆవిష్కరణలు లేవని విమర్శకులు ఈ గ్రంథాన్ని కొట్టి పారేశారు. నిజానికి ఆవిష్కరణలు చేయడం ఎంగెల్స్ లక్ష్యం కాదు, ఆ విధంగా చేశాననీ ఆయన చెప్పలేదు. జీవశాస్త్రం మీద ఆయన రాసుకున్న నోట్స్ కొన్ని మౌలికమైన ప్రశ్నలు సంధించింది. ఉదాహరణకు, మరణం అనేది దేహం విచ్ఛిన్నమైపోయి దాన్ని తయారు చేసిన రసాయనాలను విడిచిపెట్టం మాత్రమే అయితే అలాంటప్పుడు జీవం దేనితో తయారవుతుంది? ఆయన ఇంకో ప్రశ్న వేశాడు. జీవుల్లో మాంసకృత్తులు (ప్రోటీన్లు) నిర్వహించే పాత్ర ఏమిటి? జీవులు తమ మాంసకృత్తులను ఎలా తయారు చేసుకుంటాయి? భౌతికశాస్త్ర, రసాయనశాస్త్ర మౌలిక

సూత్రాలు చెబుతున్న శక్తికి సంబంధించిన అర్థంలో వీటిని ఎలా అర్థం చేసుకోవాలి? ఈ మౌలిక ప్రశ్నలకు 20వ శతాబ్దంలో జీవశాస్త్రంలో వచ్చిన విప్లవం సమాధానాలు చెప్పింది. దురదృష్టవశాత్తు 19వ శాతాబ్దపు జీవశాస్త్రంలో ఈ తాత్విక ప్రశ్నలు లేవనెత్తబడలేదు. కానీ 20వ శతాబ్దంలో మార్క్సిస్టు శాస్త్రవేత్తలు జెడి బెర్నాల్, జెబిఎస్ హాల్డేన్, అలెగ్జాండర్ ఒపారిన్‌లు "నిర్మాణం పనినీ, పని నిర్మాణాన్నీ ఎలా నిర్ధారిస్తాయి" అన్న తాత్విక ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. ఎంగెల్స్ రాసిన "వానరుడు నరుడుగా పరిణామం చెందే క్రమంలో శ్రమ పాత్ర" అన్న పుస్తకం మీద కూడా విమర్శలు వచ్చాయి. బాహ్య కారణాల వల్ల జీవి శరీర నిర్మాణంలో పరిణామం జరుగుతుందన్న లామార్క్ అభిప్రాయాన్ని ఎంగెల్స్ అనుసరించాడని విమర్శలు వచ్చాయి. విషయమేమంటే, ఆ రోజుల్లో ఈ అభిప్రాయమే ప్రబలంగా ఉండేది. డార్విన్ కూడా ఈ అభిప్రాయాన్నే కలిగి ఉండేవాడు. అయితే బాహ్య కారణాలు జీవి లోపల జన్యు ఉత్పరివర్తనలు (మ్యుటేషన్స్) కలిగిస్తాయని, జాతుల పరిణామంలో ఇవి పాత్ర వహిస్తాయని పరిశోధనల్లో తేలింది.

ఎంగెల్స్‌ను విమర్శించిన వారు ఒక విషయాన్ని మరిచిపోయారు. మనిషి అంటే కేవలం మనిషి శరీరనిర్మాణం మాత్రమే అని ఎంగెల్స్ ఏనాడూ చెప్పలేదు. మనిషి పరిణామం సామాజిక పరిణామంతో సంబంధం కలిగి ఉంది. అదే సమయంలో శరీరధర్మ పరిణామం కూడా సామాజిక పరిణామంతో సంబంధం కలిగి ఉంది. శరీరధర్మ పరిణామం మెదడుకూ, చేతికీ మధ్య సమన్వయంతో ముడిపడి ఉంటుంది. "సేకరణ సైన్సు" నుండి "వ్యవస్థీకృత సైన్సు"కు పరిణామం చెందే దశలో ఎంగెల్స్ సైన్సును అధ్యయనం చేశాడు. ఈ దశలోనే మార్క్స్ "చరిత్ర గమనం అనేది దాని సాధారణ సూత్రాలచే నిర్ణయించబడుతుంది" అని కనుగొన్నాడు. ఈ సూత్రాల అన్వేషణ, సైన్సూ దాని పద్ధతులూ, వివిధ విభాగాల మధ్య సంబంధాలూ.. ఇవన్నీ గమనం యొక్క మౌలిక సూత్రాలను రూపొందిస్తాయి. అందువల్ల "సైన్సుకు రాచమార్గం లేదు. కష్టతరమైన ఎత్తుపల్లాల్లో పయనించడానికి భయపడని వారే దేదీప్యమానమైన శిఖరాన్ని అధిరోహించగలుగుతారు" అని ఎంగెల్స్ చెప్పాడు. అంతేకాదు "నిజ జీవితంలో ఊహగానాలు అంతమైనచోట నిజమైన సైన్సు ప్రారంభమవుతుంది. సైన్సు అంటే మనిషి అభివృద్ధికి సంబంధించిన ప్రత్యక్ష కార్యాచరణ క్రమమే" అని ఆయన పేర్కొన్నాడు.



PSBH ప్రజాశక్తి బుక్‌హౌస్